



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 119 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : డాక్టర్ బి.ఆర్. అంబెద్కర్ కోనసీమ జిల్లా బుధవారం 11 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 119 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : Dr. B.R. AMBEDKAR KONASEMA DIST WED 11 MARCH 2026 PRICE :

Simultaneously Published form Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,Thadepalligudem,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా ఏపీ

- ఏపీ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ ఏర్పాటుకు సన్నాహాలు
- రాబోయే పదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు, 40 వేల ఉద్యోగాలే టార్గెట్
- శ్రీకాకుళం, అనకాపల్లి, మచిలీపట్నంలో 3 ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదన
- రాష్ట్రంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్‌పై ప్రత్యేక దృష్టి



**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్‌ను 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకు రాష్ట్ర తీరప్రాంతంలో లభించే విలువైన బీచ్ సాండ్ వంటి ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. తద్వారా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపునివ్వాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో గనుల శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రప్రదేశ్ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ (ఆప్‌ట్రా-మావీపీ)' ఏర్పాటు, పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ మిషన్ ద్వారా రాబోయే పదేళ్లలో రూ. 50,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు, 40,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం వనరులను వెలికితీయడమే కాకుండా, వాటికి విలువ జోడించడం (వాల్యూ ఎడిషన్)పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రేర్ మినరల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలోని వనరులపై పూర్తి అవగాహన పెంచుకోవడంతో పాటు, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా, రాష్ట్రంలోని తీరప్రాంతంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్ దేశంలోనే అత్యంత విలువైనవని అధికారులు సీఎంకు వివరించారు. వీటిలో ప్రధానంగా ఇల్మెనైట్, రుటైల్, జిర్కాన్, మోనాజైట్, గార్నెట్, సిల్లిమనైట్ వంటి వ్యూహాత్మక ప్రాధాన్యమున్న ఖనిజాలు ఉన్నట్లు తెలిపారు. ఈ బీచ్ సాండ్ మినరల్స్ నుంచి వచ్చే ఉత్పత్తులు పెయింట్స్, కాస్మెటిక్స్, ఫార్మా రంగాలతో పాటు ఏరోస్పేస్, రక్షణ, శస్త్రచికిత్స పరికరాలు, సెరామిక్స్, ఎలక్ట్రానిక్స్, అణు ఇంధనం, అణు రియాక్టర్ల విడిభాగాల తయారీ వంటి అత్యంత కీలకమైన పరిశ్రమలకు అవసరమని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకునేందుకు రాష్ట్రంలో మూడు ముఖ్యమైన ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. శ్రీకాకుళంలో టైటానియం

మిగతా 2లో



## అది ఫేక్ ప్రచారం... వాటిని నమ్మొద్దు

- దేవాలయాల విధ్వంసంపై వైసీపీ ఫేక్ ప్రచారం చేస్తోందన్న మంత్రి లోకేశ్
- కసాపురం ఆలయ పునర్నిర్మాణ వీడియోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్
- ఆగమ సలహాదారుల ప్రకారమే పాత ఆలయాన్ని తొలగించామని వెల్లడి
- వైసీపీ పేటియం బ్యాచ్ మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ నాయకత్వంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమె త్తారు. ఆలయాలపై దాడులు అంటూ

మిగతా 2లో

## జంట హత్యల కేసులో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి చుక్కెదురు



- గుండ్లపాడు జంట హత్యల కేసు
- బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన గురజాల కోర్టు
- కేసు తీవ్రత దృష్ట్యా బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేసిన న్యాయస్థానం
- గతేడాది జరిగిన ఈ హత్యల కేసులో ఏ-7 నిందితుడిగా ఉన్న వెంకట్రామిరెడ్డి
- కోర్టు తీర్పుతో జైలులోనే కొనసాగనున్న వైసీపీ నేత

మిగతా 2లో




## ఇండిగో వరుస వైఫల్యాలు.. కంపెనీ సీఈవో రాజీనామా

**పెన్ పవర్ డెస్క్:** వరుస వైఫల్యాలతో విమానయాన రంగాన్ని ఓ కుదుపు కుదుపేసిన ఇండిగో సంస్థలో కీలక పరిణామం జరిగింది. తమ కంపెనీ సీఈవో పీటర్ ఎల్బర్స్ రాజీనామా చేసినట్లు యాజమాన్యం ప్రకటించింది. ఆయన రాజీనామా మంగళవారం (మార్చి 10) నుంచి అమలులోకి వస్తుందని వెల్లడించింది. సంస్థ నుంచి ఎల్బర్స్ తప్పుకోవడంతో.. ఆయన స్థానంలో రాహుల్ భాటియా బాధ్యతలు తీసుకోనున్నారు. మధ్యంతర సీఈవోగా భాటియాకు బాధ్యతలు అప్పగించినట్లు మేనేజ్మెంట్ ప్రకటించింది. తదుపరి ఏర్పాట్లు పూర్తయ్యేలోపు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ గా కొనసాగుతారని యాజమాన్యం తెలిపింది.

**ఏంటి ఇండిగో సంక్షోభం:**

నవంబర్ 1, 2025 నుంచి పూర్తిస్థాయిలో అమలులోకి వచ్చిన ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ నిబంధనల రెండో దశ ఈ సంక్షోభానికి ప్రధాన మూలకారణం.

మిగతా 2లో



## వంటగ్యాస్ ఆందోళన... ప్రధాని మోదీ కీలక సమీక్ష

- 10 శాతం మేర ఉత్పత్తి పెంచాలని ఇంధన ఉత్పత్తి కంపెనీలకు ఆదేశాలు
- భారత రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయన్న కేంద్రం
- దేశానికి 70 శాతం ఉత్పత్తులు ఇతర మార్గాల్లో వస్తున్నాయన్న కేంద్రం

**పెన్ పవర్ డెస్క్:** వంటగ్యాస్‌పై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వంటగ్యాస్‌ను బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో 10 శాతం మేర ఉత్పత్తిని పెంచాలని ఇంధన

మిగతా 2లో

## బీసీసీఐ, ఐసీసీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సీఎం చంద్రబాబు

- తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటేలా అమరావతిని అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశం
- సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులతో పాటు క్రీడలు, పర్యాటక రంగాలపై ప్రత్యేక దృష్టి
- పెట్టుబడుల కోసం వచ్చే సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచన
- నీరుకొండలో భారీ టూరిజం ప్రాజెక్టుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్దేశం
- సచివాలయం, పలు సంస్థలకు భూ కేటాయింపులకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదం

**పెన్ పవర్ డెస్క్:** తెలుగు జాతి వైభవాన్ని ప్రపంచానికి చాటుతూ, భావితరాలకు ఒక గొప్ప వారసత్వ సంపదగా నిలిచేలా రాజధాని అమరావతిని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణంలో ఆదాయాన్ని సృష్టించే సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 59వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ భేటీలో రాజధాని అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలపై చర్చించి, ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రాజధాని పరిధిలోని నీరుకొండ వద్ద చేపట్టే టూరిజం ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. మొత్తం 167 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టే ఈ ప్రాజెక్టులో వాటర్ ఫ్రంట్, కల్చరల్ సెంటర్, హోటళ్లు, అమ్యూజ్‌మెంట్ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. పర్యాటకులను విశేషంగా ఆకర్షించేలా, తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా దీనిని అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని

మిగతా 2లో

## ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాస...

### చొక్కాలు పట్టుకున్న కౌన్సిలర్లు



- కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం, బాహాబాహీ
- నీటి సమస్యపై చర్చించాలని బీజేపీ డిమాండ్
- కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య తోపులాట
- ఛైర్‌పర్సన్ కార్యాలయం ఎదుట బైఠాయించిన బీజేపీ

మిగతా 2లో

## ఆర్థిక సంక్షోభంలో పాకిస్థాన్

### మంత్రులకు కూడా జీతాలు కట్.. ప్రధాని షరీఫ్ సంచలన నిర్ణయాలు



- పశ్చిమాసియా యుద్ధంతో పాక్ అతలాకుతలం
- అత్యంత కఠినమైన పొదుపు చర్యలను ప్రకటించిన షెహబాజ్ షరీఫ్
- వారానికి నాలుగు రోజులే పని చేయనున్న ప్రభుత్వ కార్యాలయాలు

**పెన్ పవర్ డెస్క్:** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు, అంతర్జాతీయ మార్కె ట్‌లో ఆయిల్ ధరల పెరుగుదల పాకిస్థాన్‌ను

మిగతా 2లో



## భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా జగన్ పాలన సాగించాడు

- సిమెంట్ ధర పెంచి ప్రజలపై రూ.165 కోట్ల భారం మోపారని విమర్శ
- జగన్ చేసిన అప్పులకు ఏటా రూ.71,800 కోట్లు చెల్లించాల్సి వస్తోందని వెల్లడి
- వైసీపీ ఐదేళ్ల పాలనలో చేసిన ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే నిదర్శనమని వ్యాఖ్య
- కూటమి ప్రభుత్వంపై జగన్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని ధ్వజం

**పెన్ పవర్ డెస్క్:** గత ఐదేళ్ల జగన్ పాలనంతా సొంత కంపెనీలకు లబ్ధి చేకూర్చడం కోసమే సాగిందని, ముఖ్యంగా భారతి సిమెం ట్ వ్యాపారాన్ని విస్తరించడమే లక్ష్యంగా పనిచేశారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ

మిగతా 2లో

## ప్రభుత్వానికి తలవంచని ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ

### లోక్‌సభలో ప్రియాంక గాంధీ

- లోక్‌సభలో సోదరుడిని గట్టిగా సమర్థించిన ప్రియాంక గాంధీ
- నెహ్రూను విమర్శించే బీజేపీ నేతలే ఇప్పుడు ఆయన్ను ఉటంకిస్తున్నారని చురక
- స్పీకర్ ఓం బిర్లా తొలగింపు తీర్మానంపై చర్చ సందర్భంగా ఈ వ్యాఖ్యలు



**పెన్ పవర్ డెస్క్:** లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తన సోదరుడు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని గట్టిగా సమర్థించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి తలవంచకుండా నిలబడిన ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ అని ఆమె కొనియాడారు. మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలంటూ ప్రవేశపెట్టిన తీర్మానంపై జరిగిన చర్చలో ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. సభకు అధ్యక్షత వహిస్తున్న ప్యానెల్ స్పీకర్ కృష్ణ ప్రసాద్ తెన్నేటి అనుమతితో ప్రియాంక మాట్లాడారు. ఈ సందర్భంగా అధికార పక్షంపై ఆమె చురకలు అంటించారు. "ప్రతిరోజూ నెహ్రూజీని విమర్శించే వారే, ఈ రోజు ఆయనను ఉటంకించడం చూసి నాకు నవ్వొచ్చింది. ఒక్కసారిగా వారికి నెహ్రూజీపై గౌరవం పుట్టుకొచ్చింది. ప్రజాస్వామ్యాన్ని అత్యంత

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# పొగతో మసకబారుతున్న బతుకులు

అత్యధిక మరణాలకు కారణంగా నిలుస్తున్న పొగ తాగడమనే దులవాటు పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో ప్రతి ఏట మార్చి మాసం 2వ బుధవారం, అనగా 11 మార్చిన "నేషనల్ నో స్మోకింగ్ డే" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఊపిరితిత్తులకు సంబంధించిన ప్రాణాంతక వ్యాధులు, శరీరంలో ప్రాణ వాయువు మోతాదులు తగ్గడం, బిపీ/స్ట్రోక్ లాంటి హృద్రోగాలకు దారి తీస్తున్న పొగ తాగడమనే దురలవాటు బారిన పడిన మిలియన్ల ప్రజలు మరణం అంచున తమ జీవితాలను బుగ్గిపాలు చేసుకోవడం, కుటుంబాలు ఆర్థిక సమస్యలను ఎదుర్కోవడం, కుటుంబ సభ్యులు అనాధలుగా మారడం లాంటి ప్రతికూలతలు పొగరాయుళ్లను వెంటాడుతున్నాయి. పొగ తాగడాన్ని క్రమంగా తగ్గించడంతో ఫలితంగా సత్వరమే బిపీ, ఊపిరితిత్తులు, గుండె స్పందనలు మెరుగవుతాయి. పొగ మానేస్తే శరీరంలో ప్రమాదకర కార్బన్ మోనాక్సైడ్ పరిమాణం తగ్గుతూ ఆరోగ్య పునరుద్ధరణకు బాటలు పడతాయి. పొగ తాగడమనే దురలవాటు తీవ్ర ప్రభావాలను దృష్టిలో పెట్టుకొన్న ప్రపంచ పౌర సమాజం 1984 నుంచి ప్రతి ఏట 2వ బుధవారం రోజున విశ్వవ్యాప్తంగా "నేషనల్ నో స్మోకింగ్ డే" పాటించడం కొనసాగుతున్నది. పొగను వదిలితే ఆరోగ్యం మెరుగవుతుందనే నినాదాన్ని క్రిందటి స్థాయి వరకు ప్రచారం చేయడం నేటి అవసరంగా భావించాలి. ప్రత్యక్షంగా పొగ తాగడంతో పాటు పొగరాయుళ్లతో పాటు వారు వదిలే పొగను పీల్చే సెకండ్ హాండ్ స్మోకర్స్ కూడా పొగ తాగినట్లుగా, అనారోగ్యం పాలు అవుతారని భావించాలి. పొగ తాగడం ప్రాణాంతకం కావడంతో బహిరంగ ప్రదేశాల్లో స్మోకింగ్ నిషేధం విధించబడడం సముచిత నిర్ణయంగా కొనియాడాలి. పొగ తాగడంవల్ల ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్ సంభావ్యత పెరుగుతుందని పొగరాయుళ్లు గమనించాలి. పొగ తాగడం వల్ల జీర్ణనాళం, మూత్రపిండాలు, కాలేయం, యూరినరీ బ్లాడర్ లాంటి ప్రధాన అవయవాలు కూడా దెబ్బతినడం ఖాయమని తేలింది. 2026 నేషనల్ నో స్మోకింగ్ డే ఇతివృత్తంగా "అన్‌మాస్కింగ్ ది అప్పీల్ : కౌంటరింగ్ నికోటిన్ అండ్ టొబాకో అడిక్షన్" లేదా "విజ్ఞప్తులను చేద్దాం : నికోటిన్, పొగాకు దురలవాటును వ్యతిరేకిద్దాం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. పొగ తాగడమనే దురలవాటు వల్ల వ్యక్తి జీవితకాలం కనీసం 10 ఏండ్లు తగ్గుతుందని తేలడం ప్రమాద హెచ్చరికగా భావించాలి. స్టైల్‌గా పొగ పీల్చడం వల్ల అనారోగ్యాలు, ఆర్థిక భారం, ఆసుపత్రి బిల్లులు, సమాజంలో చెడు పేరు, కుటుంబాల్లో చీకట్లతో పాటు చివరికి అకాల మరణం లాంటివి ఉచితంగా వస్తాయని పొగరాయుళ్లు బుద్ధి తెచ్చుకోవాలి. పొగ తాగడం వల్ల చికాకు లేదా ఇర్రిటేషన్, పొగ పట్ల తీవ్రమైన కోరిక, చంచలత్వం, నిద్రలేమి లాంటి రోగ లక్షణాలు బయట పడడం, తర్వాత తీవ్రమైన ఊపిరితిత్తులు, హృద్రోగాలు, శ్వాస క్రియ రోగాలకు దారి తీస్తుంది. "పొగకు స్వస్తి పలుకుదాం – కొత్త జీవితాలను ప్రారంభిద్దాం" అంటూ శారీరక మానసిక ఆరోగ్యాలను ఆహ్వానిస్తూ, తన కోసమే కాదు తనను నమ్మిన వారి కోసం ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకుందాం. మన ప్రాణాలు తీయక ముందే మనమే పొగకు విడాకులిద్దాం. పొగకు లొంగకుండా మన జీవితాలను సుసంపన్నం చేసుకుందాం. పొగ దురలవాటు డబ్బుతో ముడిపడింది కాదని, కుటుంబ జీవితాలతో సంబంధాన్ని పెనవేసుకుందని తెలుసుకోవాలి. పొగను వదిలితే నీ ఆరోగ్యంతో పాటు పర్యావరణ ఆరోగ్యం కూడా దెబ్బ తింటుందని మరువరాదు. తమ బతుకులు పొగసూరక ముందే బుద్ధి తెచ్చుకొని పొగకు 'నో' చెబుదాం, ఆరోగ్యకర జీవితానికి 'ఎస్' చెబుదాం.

# వంటగ్యాస్ ఆందోళన... ప్రధాని మోదీ కీలక సమీక్ష

- మొదటి పేజి తరువాయి

ఉత్పత్తి కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. ఇంధన ఉత్పత్తిపై ఆందోళనలు రేకెత్తుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక భేటీ నిర్వహించారు. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరితో ఉన్నతస్థాయి చర్చలు జరిపారు. ఎల్పీజీ నిల్వలు, సరఫరాపై సమీక్ష జరిపారు. కాగా ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో కేంద్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. కమర్షియల్ ఎల్పీజీ వాస్తవ అవసరాలను గ్యాస్ కంపెనీలు అందుకోవాల్సిందేనని ఇంధన కంపెనీలకు స్పష్టం చేసింది. ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో కొంత సంక్షోభం వాస్తవమే కానీ పెట్రోలియం ఉత్పత్తుల ప్రస్తుతానికి ఇబ్బంది లేదని కేంద్రం తెలిపింది. పశ్చిమాసియాలో యుద్ధానికి ముందు తరహాలోనే భారత రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని అన్నారు. దేశానికి వచ్చే 70 శాతం ఉత్పత్తులు హోర్ముజ్ జలసంధి నుంచి కాకుండా ఇతర మార్గాల్లో వస్తున్నట్లు కేంద్రం తెలిపింది.

# బీసీసీఐ, ఐసీసీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

అన్నారు. భవిష్యత్తులో క్రీడా రంగం అతిపెద్ద ఆదాయ వనరుగా మారబోతోందని చంద్రబాబు విశ్లేషించారు. ఒకప్పుడు నిధుల కోసం ఎదురుచూసిన బీసీసీఐ, ఐసీసీ వంటి క్రికెట్ బోర్డులు ఇప్పుడు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలుగా ఎలా ఎదిగాయో గమనించాలని అన్నారు. ఇదే తరహాలో ఇతర క్రీడలు కూడా వాణిజ్యపరంగా మారే అవకాశాలను అందిపుచ్చుకోవాలని, అమరావతిలో నిర్మించే స్పోర్ట్స్ సిటీ మాస్టర్ ప్లాన్ ఈ దిశగా ఉండాలని తెలిపారు. రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు పలు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని, వారితో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ఉండాలని చంద్రబాబు అన్నారు. "గతంలో ఉమ్మడి రాష్ట్రంలో మా ప్రభుత్వ హయాంలో సైబర్ సిటీలో పెట్టుబడులు పెట్టలేకపోయినందుకు డీఎల్ఎఫ్ వంటి సంస్థలు ఇప్పుడు బాధపడుతున్నాయి. అమరావతిలో ఆ అవకాశాన్ని వదులుకోకూడదని భావిస్తున్నాయి. ఇది మన ప్రభుత్వానికి ఉన్న విశ్వసనీయత. ఈ బ్రాండ్‌ను మరింతగా పెంచాలి" అని సూచించారు. ఓవైపు రాజధానిలో పనులను వేగవంతం చేస్తూనే, మరోవైపు పెట్టుబడిదారులను ఆకర్షించే ప్రక్రియ కొనసాగాలని స్పష్టం చేశారు. అమరావతిలో నిర్మించబోయే తెలుగు కల్చరల్ సెంటర్‌కు మంచి పేరును పరిశీలించాలని, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ కోసం ఒక పెద్ద కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**సీఆర్డీఏ అథారిటీ ఆమోదాలు**

ఈ సమావేశంలో పలు కీలక ప్రతిపాదనలకు అథారిటీ ఆమోదముద్ర వేసింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) కార్యాలయానికి 80 సెంట్ల భూమి, పరిహారంగా తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి 3 ఎకరాలు, పంచాయితీరాజ్ పరిధిలోని ఏపీఎస్ఐఆర్డీకి 5 ఎకరాల భూమి కేటాయింపులకు ఆమోదం లభించింది.

వీటితో పాటు ఏపీ సచివాలయం, హెచ్ఓడీ టవర్ల నిర్మాణంలో మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల కోసం రూ. 2,316 కోట్లకు, రూ. 119 కోట్ల వ్యయంతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు.

ఈ సమావేశంలో మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆర్థిక సంక్షోభంలో పాకిస్థాన్

- మొదటి పేజి తరువాయి

ఊపిరాడనీ యకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ దాడుల ప్రభావంతో చమురు దిగుమతులు ప్రియమవ్వడంతో, దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రధాని షెహబాజ్ షరీఫ్ అత్యంత కఠినమైన పొదుపు చర్యలు ప్రకటించారు. గల్ఫ్ దేశాల నుంచి వచ్చే చమురు సరఫరాపైనే తమ దేశం ఆధారపడి ఉందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఖర్చులను తగ్గించుకోక తప్పదని ఆయన స్పష్టం చేశారు. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వ కార్యాలయాలు ఇకపై వారానికి నాలుగు రోజులు (సోమవారం నుంచి గురువారం వరకు) మాత్రమే పనిచేస్తాయి. అయితే బ్యాంకులు, ఆసుపత్రులు, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ఈ నిబంధన వర్తించదు. వచ్చే రెండు వారాల పాటు స్కూళ్లు, కాలేజీలు మూసివేస్తున్నట్లు ప్రకటించారు. ఉన్నత విద్యా సంస్థలు తరగతులను ఆన్‌లైన్‌లో నిర్వహించాల్సి ఉంటుంది. ప్రభుత్వ, అధికారిక వాహనాలకు ఇచ్చే పెట్రోల్ కోటాను 50 శాతానికి తగ్గించారు. అలాగే రాబోయే రెండు వారాల పాటు 60 శాతం ప్రభుత్వ వాహనాలను రోడ్డెక్కించబోమని ప్రధాని తెలిపారు. అంబులెన్స్‌లు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌కు దీని నుంచి మినహాయింపు ఇచ్చారు.

మంత్రులు, సలహాదారులు రాబోయే రెండు నెలల పాటు ఎటువంటి జీతాలు తీసుకోరు. పార్లమెంటు సభ్యులందరికీ 25 శాతం, రూ. 3 లక్షల కంటే ఎక్కువ సంపాదించే ప్రభుత్వ ఉద్యోగులకు 20 శాతం

జీతాల్లో కోత విధించారు. ప్రధాని, ముఖ్యమంత్రులు, గవర్నర్లు సహా అందరు ప్రజాప్రతినిధులు, అధికారుల విదేశీ పర్యటనలపై పూర్తి నిషేధం విధించారు. కేవలం అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అనుమతి ఉంటుంది.

# ఇండిగో వరుస వైఫల్యాలు.. కంపెనీ సీఈవో రాజీనామా

- మొదటి పేజి తరువాయి

ఈ నిబంధనలు పైలట్‌ల వారపు విశ్రాంతి సమయాన్ని 36 గంటల నుంచి 48 గంటలకు పెంచాయి. ఇది పైలట్‌ల అలసట రిస్క్‌ను తగ్గిస్తుంది. ఈ మార్పులు విమాన ప్రయాణాల భద్రతను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మెరుగుపరచాలని లక్ష్యంగా చేసిన ప్రయత్నం. ఈ నిబంధనల గురించి రెండు సంవత్సరాల ముందు నుంచే పూర్తి అవగాహన ఉన్నప్పటికీ, కొత్త నిబంధనలకు అనుగుణంగా తగినంత మంది సిబ్బందిని సమకూర్చుకోవడంతోపాటు రోస్టరింగ్ వ్యవస్థను మెరుగుపరచడంలో ఇండిగో నిర్లక్ష్యం వహించింది. భారతదేశంలో అత్యధిక విమానాలను నడుపుతున్న సంస్థగా, సిబ్బంది కొరతను సరిచేయడానికి ఇండిగో ప్రణాళికా లోపం సంస్థ కార్యకలాపాలను ఒక్కసారిగా కుప్పకూల్చింది.

**డీజీసీఏ వైఫల్యం**

దేశ పౌర విమానయాన భద్రతకు అత్యున్నత బాధ్యత వహించే డీజీసీఏ చర్యలు ఈ సంక్షోభంలో అసమర్థతను చూపించిందని నిపుణులు విమర్శిస్తున్నారు. డీజీసీఏ, ఇండిగోకు షోకాజ్ నోటీసు ఇవ్వడం న్యాయపరమైన చర్య అయినప్పటికీ, వేలాది విమానాలు రద్దై, ప్రయాణీకులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయిన తర్వాత మాత్రమే డీజీసీఏ స్పందించింది.

ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్1937 ప్రకారం డీజీసీఏ సంస్థకు విమానయాన ఆపరేటర్‌పై భారీ జరిమానాలు విధించే అధికారం లేదా ఎయిర్ ఆపరేటర్స్ పర్మిట్ రద్దు చేసే అధికారం ఉంది. ఈ జాప్యం డీజీసీఏ వ్యవస్థాపరమైన పర్యవేక్షణ వైఫల్యాన్ని తెలియజేస్తుంది. ముందస్తు తనిఖీ చేయడంలో విఫలమవడం, డీజీసీఏ తన ప్రాథమిక భద్రతా విధులను పూర్తిగా నిర్లక్ష్యం చేసినట్లేనని విమర్శలు వచ్చాయి.

**ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం**

దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో చట్టపరమైన బాధ్యతతో పాటు నైతిక బాధ్యత వహించాలి. నిబంధనల అమలుకు తగిన ఏర్పాట్లు చేయడంలో విఫలమవడం అనేది కేవలం నిర్వహణ లోపం కాదు. ఇది 'ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం'గా పరిగణించవచ్చు. ఎందుకంటే, తమ అధిక లాభాలను కాపాడుకోవడానికి, ఇండిగో భద్రతా నిబంధనల అమలును ఆలస్యం చేసిందని, తద్వారా సంస్థ విమానయాన చట్టాలను ఉల్లంఘించిందని స్పష్టం చేస్తోంది. న్యాయ పదజాలంలో 'రెస్ ఇప్సా లోక్విటూర్' అనే సూత్రం ఇక్కడ వర్తిస్తుంది. అంటే, నష్టం జరగడానికి సంస్థ నిర్లక్ష్యమే కారణమని స్పష్టంగా తెలుస్తోంది. ఈ నిబంధనల ఉల్లంఘన విమానయాన చట్టాల క్రింద ఇండిగో విశ్వసనీయతను తీవ్రంగా దెబ్బతీసింది.

డీజీసీఏ సీఏఆర్? (పౌర విమానయాన అవసరాలు) సెక్షన్ 3, సిరీస్ ఎం, పార్ట్ ×ు అనేది విమాన ప్రయాణానికి నిరాకరించినప్పుడు, విమానాలు రద్దు అయినప్పుడు, ఆలస్యం అయినప్పుడు ప్రయాణీకులకు విమానయాన సంస్థలు అందించవలసిన సౌకర్యాలు, పరిహారం గురించిన నియమావళి ప్రకారం అందించాల్సిన నష్టపరిహారం, రిఫండ్‌లతో పాటు ఇతర సౌకర్యాలను సకాలంలో అందించడంలో కూడా ఇండిగో వైఫల్యం చెందింది. ఈ వైఫల్యం కారణంగా ఇండిగో కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ 2019 కింద 'సేవా లోపం'కు పూర్తి బాధ్యత వహించాలి.

# భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా జగన్ పాలన సాగించాడు

- మొదటి పేజి తరువాయి

మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో విమర్శించారు. సిమెంట్ ధరను కృత్రిమంగా పెంచి ప్రజాధనాన్ని తన కంపెనీకి మళ్లించారని, అదే సమయంలో తన మీడియా సంస్థ అయిన సాక్షికి వందల కోట్ల రూపాయల ప్రకటనలు ఇచ్చుకున్నారని ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

**భారతి సిమెంట్‌కు రూ. 165 కోట్ల లబ్ధి**

జగన్ తన అధికారాన్ని పూర్తిగా దుర్వినియోగం చేశారని పార్థసారథి ధ్వజమెత్తారు. "రాష్ట్రానికి ఆదాయం తెచ్చే మార్గాలను గాలికొదిలేసిన జగన్, తన కంపెనీల ఆదాయానికి మాత్రం ఎలాంటి లోటు రాకుండా చూసుకున్నారు. భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చేందుకు సిమెంట్ బస్తాపై రూ. 3 పెంచి, ప్రజలపై ఏకంగా రూ. 165 కోట్ల భారం మోపారు. ఈ నిర్ణయంతో భారతి సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం మూడు రెట్లు పెరిగింది. మరోవైపు, సాక్షి పత్రికకు ప్రకటనల రూపంలో రూ. 400 కోట్లకు పైగా కట్టబెట్టారు. ప్రత్యేక జీవోలు జారీ చేసి వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో బలవంతంగా సాక్షి పత్రికను కొనిపించారు. దీన్నిబట్టి ఆయన పాలన ఎవరి కోసం సాగిందో స్పష్టమవుతోంది" అని పార్థసారథి విమర్శించారు.

**ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే సాక్ష్యం**

జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని, ఆయన సృష్టించిన ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే సాక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో రాష్ట్రం మొత్తం రూ. 9.70 లక్షల కోట్ల అప్పు చేసిందని, ఈ అప్పులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏటా రూ. 71,800 కోట్లు అసలు, వడ్డీల రూపంలో చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

"ఇప్పుడు అసెంబ్లీకి రాకుండా ఇంట్లో కూర్చుని, కూటమి ప్రభుత్వంపై జగన్ అసత్య ప్రచారాలు చేస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ. 87 వేల కోట్లు అప్పు చేసిందని దుష్ప్రచారం చేస్తున్నారు. కానీ కాగ్ నివేదిక ప్రకారం ఆ ఏడాదిలో మొత్తం అప్పు రూ. 81 వేల కోట్లు. అందులో తొలి మూడు నెలలు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వమే రూ. 27,025 కోట్లు అప్పు చేసింది. ఆ తర్వాత తొమ్మిది నెలల్లో కూటమి ప్రభుత్వం రూ. 53 వేల కోట్లు మాత్రమే అప్పు చేసింది. జగన్ చేసిన అప్పులతో ఆస్తులు సృష్టించలేదు, కానీ మేం మూలధన వ్యయం కింద రూ. 16 వేల కోట్లు ఖర్చుచేసి భవిష్యత్ తరాలకు ఆస్తులను అందిస్తున్నాం" అని పార్థసారథి వివరించారు.

**సంక్షేమం, అభివృద్ధిలో ముందున్నాం**

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, సంక్షేమ పథకాల అమలులో రాజీ పడటం లేదని మంత్రి తెలిపారు. "జగన్ హయాంలో ఐదేళ్లలో అమ్మ ఒడికి రూ. 26 వేల కోట్లు ఖర్చు చేస్తే, మా ప్రభుత్వం ఐదేళ్లలో రూ. 35 వేల కోట్లు ఖర్చు చేయనుంది. సామాజిక పింఛన్లకు జగన్ రూ. 58,500 కోట్లు ఖర్చు చేస్తే, మేం కేవలం 20 నెలల్లోనే రూ. 58,654 కోట్లు చెల్లించాం. చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతో రాష్ట్రంలో మళ్లీ విశ్వసనీయత పెరిగింది. జగన్ పాలనలో వెళ్లిపోయిన కంపెనీలు తిరిగి పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి. ఇప్పటికే 20 పారిశ్రామిక పాలసీలు తీసుకొచ్చి, 20 నెలల్లో రూ. 8 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. తద్వారా 6.50 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం. ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే మా లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు. అన్నం పెట్టే రైతులను సైతం జగన్ మోసం చేశారని, ధాన్యం కొనుగోలు బకాయిలు రూ. 1600 కోట్లు చెల్లించకుండా వెళ్ళిపోయారని పార్థసారథి మండిపడ్డారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తోందని తెలిపారు. పోలవరం, అమరావతి వంటి కీలక ప్రాజెక్టులను నాశనం చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులను పక్కదారి పట్టించి రాష్ట్రాన్ని ఐదేళ్లు వెనక్కి నెట్టిన జగన్, ఇప్పుడు ప్రజలను మభ్యపెట్టాలని చూడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.

# జంట హత్యల కేసులో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి చుక్కెదురు

పల్నాడు జిల్లా గుండ్లపాడులో సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ నేత పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి న్యాయస్థానంలో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను గురజాల కోర్టు సోమవారం కొట్టివేసింది. కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేయలేమని న్యాయమూర్తి స్పష్టం చేశారు. గతేడాది గుండ్లపాడుకు చెందిన జవిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన సోదరుడు కోటేశ్వరరావు హత్యకు గురయ్యారు. తెలంగాణలోని హుజూర్‌నగర్‌లో ఒక వివాహానికి హాజరై బైక్‌పై తిరిగి వస్తుండగా, వెల్దుర్తి మండలం బొదిలవీడు సమీపంలో వారిని వాహనంతో ఢీకొట్టి హతమార్చారు. ఈ హత్యల వెనుక పిన్నెల్లి సోదరుల ప్రమేయం ఉందని ఆరోపణలు రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఏ–7 నిందితుడిగా ఉన్నారు. ఆయన తరఫున దాఖలైన బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన గురజాల కోర్టు, కేసు పూర్వాపరాలను, గాంభీర్యాన్ని దృష్టిలో ఉంచుకొని బెయిల్‌ను తిరస్కరించింది. తాజా తీర్పుతో వెంకట్రామిరెడ్డి జైలులోనే కొనసాగనున్నారు.

## ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్

# సమావేశం రసాభాస...

ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం రసాభాసగా మారింది. కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. రెండు పార్టీల కౌన్సిలర్లు పరస్పరం చొక్కాలు పట్టుకుని, బాహాబాహీకి దిగారు. ఇరు పార్టీల గందరగోళం మధ్యనే ఛైర్‌పర్సన్ అనూష 'అజెండా పాస్' అంటూ ప్రకటన చేసి తన ఛాంబర్‌లోకి వెళ్లిపోయారు. అయితే చర్చ లేకుండానే అజెండాను ఎలా పాస్ చేస్తారని బీజేపీ కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛైర్‌పర్సన్ ఛాంబర్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఛైర్‌పర్సన్, కాంగ్రెస్ కౌన్సిలర్లు బయటకు రాకుండా బీజేపీ కౌన్సిలర్లు అడ్డుకున్నారు. పోలీసులు జోక్యంతో ఛైర్‌పర్సన్ బయటకు వచ్చారు. దీంతో దాదాపు మూడు గంటల పాటు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. కాగా, నీటి సమస్యపై చర్చించాలని బీజేపీ కౌన్సిలర్లు డిమాండ్ చేయడం ఉద్రిక్తతకు దారి తీసింది. కాంగ్రెస్ కౌన్సిలర్ అజయ్, బీజేపీ కౌన్సిలర్ రాకేష్ మధ్య తోపులాట చోటు చేసుకుంది. పాలకవర్గం సభను నామమాత్రంగా నిర్వహిస్తున్నారని బీజేపీ కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు.

# అది ఫేక్ ప్రచారం... వాటిని నమ్మొద్దు

- మొదటి పేజి తరువాయి

అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ ను సోషల్ మీడియాలో పంచుకున్నారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాల విధ్వంసం జరుగుతున్నట్లు వైసీపీ ఫేక్ ముఠా ప్రచారం చేస్తోంది... ఇందులో ఎలాంటి వాస్తవం లేదు... వీటిని నమ్మొద్దు... ప్రజల మధ్య కులం, మతం, ప్రాంతం పేరుతో అలజడి రేపేందుకు యత్నిస్తున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయ పునర్నిర్మాణం సందర్భంగా తీసిన వీడియోలతో ఫేక్ ప్రచారం చేస్తున్నారు. దేవాలయ గర్భాలయం, విమానగోపురం, అర్ధ మండపం రాతి నిర్మాణపు పనులు 60 శాతం పూర్తయ్యాయి. దేవస్థానం వైదిక కమిటీ సభ్యుల తీర్మానం ప్రకారం, ఆగమ సలహాదారుల సూచనల మేరకు ఫిబ్రవరి 28న శాస్త్రోక్తంగా పాత ఆలయాన్ని తొలగించారు. ఫేక్ ప్రచారం చేస్తున్న వైసీపీ పేటియం బ్యాచ్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రజలు నిజానిజాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను" అంటూ నారా లోకేశ్ ట్వీట్ చేశారు.

# ప్రభుత్వానికి తలవంచని ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ

- మొదటి పేజి తరువాయి

బలోపేతం చేసింది నెహ్రూజీనే అని ఇప్పుడు చెబుతున్నారు" అని ప్రియాంక వ్యాఖ్యానించగా, ప్రతిపక్ష సభ్యులు బల్లలు చరుస్తూ మద్దతు తెలిపారు. అనంతరం రాహుల్ గాంధీని సమర్థిస్తూ, "గత 12 ఏళ్లుగా ఈ ప్రభుత్వం ముందు తలవంచని వ్యక్తి ఈ దేశంలో ఒక్కరే ఉన్నారు. ఆయనే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ. ఎందుకంటే లోక్‌సభ నాయకుడు నిజం మాట్లాడటానికి వెనుకాడరు. కానీ, వారు (ప్రభుత్వం) నిజాన్ని జీర్ణించుకోలేరు" అని ప్రియాంక అన్నారు. అంతకుముందు, స్పీకర్‌కు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు స్పందించారు. రాజ్యాంగం ప్రకారం చట్టాలు, నిబంధనలకు అధికార, ప్రతిపక్ష సభ్యులందరూ కట్టుబడి ఉండాలని అన్నారు. "ఏ వ్యక్తి అయినా తనను తాను అన్నింటికీ అతీతుడిగా భావించినప్పుడు, అతడిని నిలదీయడం చాలా ముఖ్యం" అని రాహుల్ గాంధీని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు.

# 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా ఏపీ

- మొదటి పేజి తరువాయి

పార్క్ (ఏడాదికి 15 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం), అనకాపల్లిలో రేర్ ఎర్త్ కారిడార్ (ఏడాదికి 25,000 టన్నుల ఉత్పత్తి లక్ష్యం), మచిలీపట్నంలో సమగ్ర టైటానియం, రేర్ ఎర్త్ కారిడార్‌లను ఏర్పాటు చేయాలని తమ ప్రతిపాదనలను సీఎం ముందుంచారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, గనులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రావులపాడువేదిరేశ్వరం కాలువగట్టు మార్గంలో త్రాగునీటి పైపులైన్ పగులు

**కాలువ లోకి వృధాగా పోతున్న తాగునీరు**

**రావులపాలెం పెన్ పవర్ మార్చి 10:**రావులపాలెం మండలం రావులపాడు నుండి వేదిరేశ్వరం గ్రామానికి వెళ్లే కాలువగట్టు మార్గంలో త్రాగునీటి పైపులైన్ పగిలి నీరు వృథాగా కాలువలోకి వెళ్తున్న సంఘటన స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. కొంతకాలంగా పైపులైన్ పగిలి ఉన్నప్పటికీ ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో భారీగా త్రాగునీరు వృథా అవుతోంది. ఈ పైపులైన్ పగిలిపోవడంతో దిగువ ప్రాంతంలో ఉన్న గృహాలకు త్రాగునీటి సరఫరా తగ్గిందని స్థానికులు వాపోతున్నారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. కావున సంబంధిత పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి పగిలిన పైపులైన్‌కు తక్షణమే మరమ్మతులు చేసి ప్రజలకు త్రాగునీటి సరఫరా సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# పెన్ పవర్

కాకినాడ

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా



## చింతలూరు శ్రీ నూకాలమ్మ పద్య మాలిక ఆవిష్కరణ

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 10;**చింతలూరు శ్రీ నూకాంబికా అమ్మవారిపై గ్రామానికి చెందిన ప్రముఖ కవి గౌరీ మల్లిక్ (కామవరపు మల్లికార్జునరావు) రచించిన షట్ పద్యమాలికను మంగళవారం దేవస్థానం ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి, పాలకమండలి చైర్మన్ వీరి అప్పారావు, సభ్యుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. భక్తులపై అమ్మవారి కరుణ, మహిమలను ప్రస్తావిస్తూ గౌరీ మల్లిక్ ఈ రచన చేశారు. వీటికి కృతిపత్యం చింతలూరు ఆయుర్వేద ఫార్మశీ డైరక్టర్ ద్విభాష్యం ధన్వంతరి నిర్వహించారు. ఈ పద్యమాలిక ఆవిష్కరణ కార్యక్రమంలో వైట్ల శేషబాబు, గన్ని చిన్నబ్బు, చర్ల గిరినాథ్ శర్మ, పసుపులేటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## సముద్రపు నాచు పెంపకం తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం

✸ స్వయం సహాయక సంఘ మహిళలకు శిక్షణ



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 10:** అమృత యూనివర్సిటీ కేరళ వారు గ్రామీణ పేదరిక నిర్మూ లన సంస్థతో ఎం ఓ యు కుదుర్చుకుని డ్వాక్రా సంఘాలకు సివిడ్ పెంపకం, ఉత్పత్తుల తయారీపై శిక్షణలు ఇవ్వడం జరుగుతోశీదని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ వెల్లడించారు మంగళవారం స్థాని కలెక్టరేట్ నందు జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మత్స్య శాఖ గ్రీన్ క్లైమేట్ ఫండ్ అధికారులతో సమావేశం నిర్వ హించి సివిడ్ సాగు వాటి ఉత్ప త్తుల తయారీకై హేచరీ యూనిట్ నెలకొల్పే అంశాలపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్షించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తీర ప్రాంతవా సులు, మత్స్యకార కుటుంబాలు అదనపు ఆదాయం పొందే దిశగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ మత్స్యశాఖ సంయుక్తంగా సముద్రపు నాచు సాగు, విలువాదారిత వస్తువుల తయారీ హేచరీ ఏర్పాటుకు పైలెట్ ప్రాజెక్టు ను సిద్ధం చేసినట్లు తెలిపారు. సముద్రపు నాచు(సివిడ్) సము ద్రంలో పెరిగే ఒక రకమైన మొక్కల వర్గమని, ఈ నాచును ఆహారం, ఔషధాలు, ఎరువులు, కాస్మెటిక్స్ తయారీలో వినియోగిస్తారన్నారు సీవీడ్ సాగు తీరప్రాంతాల్లో ఆదాయవంతమైన, పర్యా వరణ అనుకూలమైన వృత్తి అన్నారు సివిడ్ సాగును ఐ సి ఏ ఆర్, సీఎం ఎఫ్ ఆర్ ఐ వంటి సంస్థలు ప్రోత్సహిస్తున్నాయన్నారు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన శిక్షణలు, జి సి ఎఫ్ పండు, క్రెడిట్ ప్లాన్ కింద బ్యాంకు రుణాలు అందించేలా చర్యలు తీసు కుంటున్నట్లు తెలిపారు మత్స్యకారులకు అదనపు ఆదాయంగా దోహదపడు తుందన్నారు స్థానికంగా కప్పాఫికస్ రకం సివిడ్ తయారీ సి జి ఎఫ్ మరియు ప్రభుత్వ రాయితీల ద్వారా సాగు జరుగు తోందన్నారు. సముద్రపు నాచు పెంపకం తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం ఇచ్చే సముద్ర వ్యవ సాయం. ప్రభుత్వం కూడా దీనికి శిక్షణ, సబ్సిడీలు అం దిస్తోందన్నారు. అమృత యూనివర్సిటీ ప్రతినిధులు కాట్రేనికోన మండలంలో 40 మంది స్వయం సహాయక సంఘ మహిళలకు మూడు రోజులపాటు సివిడ్ ద్వారా విలువదారిత వస్తువుల తయారీపై శిక్షణ పొందా రన్నారు. సముద్రపు నాచు ద్వారా ఎన్ని రకాల ఉత్పత్తులు తయారు చేయాలి అనేది ప్రాక్టికల్ గా తయారుచేసి ఈ శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. దీనివల్ల మత్స్య కార మహిళలకు సుస్థిరమైన జీవనోపాధి లభించి ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం అన్నారు. సివిడ్ లో అధిక పోషకాలు ఉండడం తో దీన్ని సూపర్ ఫుడ్ గా పిలుస్తారన్నారు. ఇప్పటికే ఉప్పలగుప్తం మండలం ఎస్ యానం తీర ప్రాంతంలో ఈ సాగును ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ పైలెట్ ప్రాజెక్టు పై సమగ్రంగా చర్చించేందుకు సిఎంసి సిఐఎ స్పార్ ప్రతినిధులతో మరో మారు ఈనెల 24న సమీక్షించడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పి డి డి రాంబాబు మత్స్య శాఖ ఏడి వర్ధన్ డిపిఎం ఆది గ్రీన్ క్లైమేట్ ఫండ్ ప్రతినిధి శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు



## నేడు ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి హుండీ లెక్కింపు

**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 9** కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని వేయించి యున్న శ్రీ జగన్మోహిని కేశవ, గోపాల స్వామి దేవస్థానంలో బుధవారం ఉదయం 9 గంటలకు హుండీలు లెక్కింపు కార్యక్రమం జరుగును. అలాగే శ్రీ ఉమా కమండలేశ్వర స్వామి దేవస్థానంలో మధ్యాహ్నం 2 గంటలకు హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. దేవదాయ ధర్మదాయ శాఖ రాజమహేంద్రవరం తనిఖీదారు పర్యవేక్షణలో ఆలయ చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు, స్వామి వారి సేవకులు, సేవా సమితి సభ్యులు, భక్తుల సమక్షంలో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి బి. వెంకటరమణమూర్తి తెలిపారు. ఆసక్తి గల భక్తులు పాల్గొనవలసిందిగా కోరారు.

## శ్రీ దాస ఆంజనేయస్వామి ఆలయ పునర్ నిర్మాణానికి తన వంతు కృషి.



✸ ప్రముఖ పారిశ్రామికవేత్త, సంపర సుధాకర్ శ్రీ వినాయక వర్మ

**కిర్లంపూడి, పెన్ పవర్, మార్చి 10**: కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ దాస ఆంజనేయ ఆలయ పునర్ నిర్మాణానికి అన్ని చర్యలు తీసుకుంటానని ప్రముఖ పారిశ్రామికవేత్త, బిల్డర్, గొప్ప అధ్యాత్మిక వేత్త సంపర సుధాకర శ్రీ వినాయక వర్మ అన్నారు. కోదండ రాముని ఆలయం చెంతనే ఉన్న 130 సంవత్సరాల చరిత్ర గల శ్రీ దాస ఆంజనేయ స్వామి పురాతన ఆలయాన్ని సుధాకర శ్రీ వినాయక వర్మ సందర్శించి స్వామివారిని దర్శించికున్నారు. ఈ సందర్భంగా ఆలయం శిదిలస్థితికి చేరుకోవడం గమనించారు. దీంతో సుధాకర శ్రీ వినాయక వర్మ మాట్లాడుతూ 130 సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన దాస ఆంజనేయ స్వామి ఆలయాన్ని పునర్ నిర్మించేందుకు అన్ని చర్యలు తీసుకుంటానని ఆలయ కమిటీ సభ్యులకు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. దీంతో యల్లపు నరసరావు కుటుంబీకులు సుధాకర్ శ్రీ వినాయక వర్మ తీసుకున్న నిర్ణయానికి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జగపతినగరం గ్రామస్తులు పాల్గొని సంపర సుధాకర్ శ్రీ వినాయక వర్మను అభినందించారు.

## ర్యాంకులు కోసం మాస్ కాపింగ్..

పదవతరగతి పరీక్షలపై మాస్ కాపింగ్ జరగకుండా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల యొక్క ఆవేదన...




**కాత్రేనికోన,పెన్ పవర్ మార్చి 10:** పదవతరగతి పబ్లిక్ పరీక్షలలో అక్రమాలకు పాల్పడితే భాద్యులను జైలకు పంపుతామని విద్యాశాఖ నిర్ణయించింది. అయితే ఇటువంటి నిర్ణయం విద్యాశాక అధికారులు తీసుకుంటారా అనే అనుమానం విద్యార్థులలోను, వారి తల్లితండ్రిలలోనూ అనుమానాలు రేకేతిస్తున్నాయి. ప్రైవేట్ విద్యాసంస్థలు, కార్పొరేట్ విధ్యాసంస్థలు విద్యార్థులకు ర్యాంకుల కోసం మాస్ కాపీంగ్ సెంటర్లలో ఇన్విజీలేటర్లను మేనేజ్ చేసుకుని అక్రమాలకు పాల్పడేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. దీనివల్ల గవర్నమెంట్ స్కూల్ లలో చదివిన విద్యార్థులకు, కష్టపడి చదివిన విద్యార్థులకు నష్టం వాటిల్లుతుంది. గతంలో కొంతమంది ఇన్విజీలేటర్స్ కూడా ప్రైవేట్ విద్యాసంస్థలతో కుమ్మక్కయి సెంటర్ లలో వారికి అనుకూలమైన వారికి స్లిప్లను అందజేయటం, బిట్ పేపర్లను చెప్పించేయటం వంటి సంఘటనలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని చోట్ల స్మార్ట్ ఫోన్ల ద్వారా కూడా అక్రమాలు జరుగుతున్నాయానే ఆరోపణలు కూడా లేకపోలేదు. 1997 లోనే 25/97 చట్టం తీసుకొచ్చినప్పటికి విద్యాశాఖ నాటి నుండి నేటివరకు ఒక మాస్ కాపీంగ్ కేసు కూడా నమోదు చేయకపోవటం గమనార్హం. ఈ చట్టం ప్రకారం అక్రమాలకు పాల్పడుతున్నట్లు రుజువైతే 3 ఏళ్ళ నుండి 7 ఏళ్ళ వరకు జైలు శిక్ష, రూ-5 వేలనుంచి, రూ -1 లక్ష రూపాయలవరకు జరిమాన విధించే అవకాశం ఉందని విద్యాశాఖ తెలియజేసింది. పదవతరగతి పబ్లిక్ పరీక్షలలో సామూహిక చూసిరాతలు, మాస్ కాపీంగ్ చాలా చోట్ల జరుగుతున్నా అధికారులు చూసిచూడనట్లు వ్యవహారిస్తు నట్లు సామాచారం. కొన్నిచోట్ల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం తమ ఉత్తీర్ణత శాతం పెంచుకోవటానికి, ర్యాంకు లు సాధించుకోవటానికి విద్యాశాక అధికారులతో కుమ్మక్కయి ఇటువంటి అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇకపై ఇటువంటి అక్రమాలకు పాల్పడిన వారిపై పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయాలనీ విద్యాశాఖ తాజా ఆదేశాలను జారిచేసింది. ఎంతవరకు అమలు జరుగుతాయో చూడాల్సి ఉంది.

## వాడపల్లి వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదం పరిశీలించిన

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి





ఆలయ ఉప కమిషనర్ సూర్య చక్రధర్ రావు

**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 10:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి క్షేత్రానికి తెలుగు రాష్ట్రాల నలుమూలల నుండి భక్తులు భారీగా తరలివస్తున్నారు. ముఖ్యంగా ఏడు శనివారాల వెంకన్న దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున వచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. మంగళవారం వేగుజామున ఆలయంలో విశిష్ట పూజా కార్యక్రమాలను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారి దర్శనం చేసుకుని ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అష్టోత్తరం, నిత్య కళ్యాణం వంటి పూజా కార్యక్రమాలలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇటీవల రాష్ట్రంలో లడ్డు ప్రసాదాల నాణ్యతపై వస్తున్న వివిధ రకాల అపోహల నేపథ్యంలో వాడపల్లి క్షేత్రంలో తయారుచేస్తున్న లడ్డు ప్రసాదంపై ఆలయ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మంగళవారం ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు లడ్డు తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. లడ్డూల తయారీలో ఉపయోగిస్తున్న నెయ్యి, ఇతర పదార్థాలు, పరిశుభ్రత, నిల్వ విధానాలను ఆయన సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో తయారుచేసే లడ్డు ప్రసాదం పూర్తిగా నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ తయారు చేస్తున్నామని తెలిపారు. భక్తులకు అందించే ప్రసాదంలో ఎలాంటి రాజీ పడకుండా శు ద్ధమైన నెయ్యి మరియు నాణ్యమైన పదార్థాలను మాత్రమే వినియోగిస్తున్నామని చెప్పారు. భక్తులు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా స్వామివారి ప్రసాదాన్ని విశ్వాసంతో స్వీకరించాలని సూచించారు. అలాగే ఆలయంలో ప్రతిరోజూ తయారయ్యే లడ్డు ప్రసాదంపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని, పరిశుభ్రత మరియు నాణ్యత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని వెల్లడించారు. స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఉత్తమమైన ప్రసాదం అందించడమే ఆలయ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. వాడపల్లి క్షేత్రంలో జరిగే పూజా కార్యక్రమాలు, ప్రసాదాల తయారీ విధానం అన్నీ శాస్త్రోక్తంగా నిర్వహించబడుతున్నాయని ఆలయ అధికారులు తెలిపారు. దీంతో స్వామివారి దర్శనంతో పాటు లడ్డు ప్రసాదాన్ని స్వీకరించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

## రాజ్యసభలో బీసీ ఉనికి కొనసాగాలి బొక్కా ప్రసాద్



**కొత్తపేట,పెన్ పవర్, మార్చి 10:**ఆంధ్రప్రదేశ్‌లో గతంలో బీసీ వర్గాలకు కేటాయించిన రాజ్యసభస్థానాలను మళ్లీ అదే వర్గాలకు ఇవ్వాలని కొత్తపేటనియోజకవర్గ టీడీపీ యువనాయకుడు బొక్కా ప్రసాద్ డిమాండ్ చేశారు.రాష్ట్రంలో నిజమైన సామాజిక న్యాయం అమలుకావాలంటే బీసీవర్గాలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు.జనాభాలో అధిక శాతం ఉన్నప్పటికీ బీసీలకు ఉన్నతస్థాయి పదవుల్లో అవకాశాలు తక్కువగా లభిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.బీసీవర్గాల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా నిలిచిందని బొక్కా ప్రసాద్ అన్నారు.స్థానికసంస్థల్లో రిజర్వేషన్ల పెంపు,బీసీ రక్షణ చట్టం వంటి పలు సంక్షేమ కార్యక్రమాలకు టీడీపీ నాందిపలికిందని గుర్తుచేశారు. బీసీల రాజకీయ భవిష్యత్తుకు భరోసా కల్పించే దిశగా పార్టీ నిరంతరం కృషి చేస్తోందన్నారు.కూటమి రాజకీయాల కారణంగా గతంలో కొంతమంది బీసీ నాయకులు తమ అవకాశాలను త్యాగం చేసిన విషయం తెలిసిందేనని ఆయన తెలిపారు. అయినప్పటికీ బీసీవర్గాల రాజకీయ భాగస్వామ్యం కొనసాగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.త్వరలోఖాళీ కానున్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ స్థానాన్ని మళ్లీ బీసీ వర్గానికే కేటాయించడం ద్వారా వారి ఉనికిని నిలబెట్టాలని బొక్కా ప్రసాద్ సూచించారు.ఇది బీసీవర్గాలకు న్యాయం చేయడమే కాకుండా రాష్ట్రంలో సామాజిక సమతుల్యతకు కూడా దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.రాష్ట్ర అభివృద్ధిలో బీసీ వర్గాల పాత్ర కీలకమని,వారికి సముచిత రాజకీయ అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యతఅని బొక్కా ప్రసాద్ స్పష్టం చేశారు.సామాజిక న్యాయం,సమానఅవకాశాల పరిరక్షణ కోసం కూటమి ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుని బీసీ వర్గాల ఆశయాలను గౌరవించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## జల జీవన్ మిషన్‌తో గ్రామాలకు తాగునీటి భద్రత

- శివలలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన



**రామచంద్రపురం/కె. గంగవరం, పెన్ పవర్ మార్చి 10:**రామచంద్రపురం నియోజకవర్గం కె. గంగవరం మండలం శివల గ్రామంలో జల జీవన్ మిషన్ పథకం కింద రూ.34.30 లక్షల వ్యయంతో 40 వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించనున్న మంచినీటి వాటర్ ట్యాంక్‌కు కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మంగళవారం శంకుస్థాపన చేశారు.మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఎం. శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామారావు, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, కూటమి పార్టీ నాయకుల సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ప్రతి గ్రామానికి సురక్షితమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. జల జీవన్ మిషన్ పథకం గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే మహత్తర కార్యక్రమమని అన్నారు. శివల గ్రామంలో నిర్మించబోయే ఈ వాటర్ ట్యాంక్ పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలకు శుద్ధమైన, సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి వచ్చి ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడుతుందని పేర్కొన్నారు.గ్రామాభివృద్ధి కోసం మౌలిక వసతుల కల్పనలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని నాణ్యతతో వేగంగా పూర్తి చేసి త్వరితగతిన ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పంచాయతీ అధికారులు, డీసీ నిడదవోలు సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ రైతు అధ్యక్షులు బలుసు శివప్రసాద్, బీసీ సెల్ మండల అధ్యక్షులు వాసంశెట్టి నాగేంద్ర, ఎంపీటీసీ వాసంశెట్టి నాగమణి, నిడదవోలు రవి, కాకి అప్పారావు, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజమహేంద్రవరం ఆర్ అండ్ బి అతిథి గృహంలో 12న మహిళల సమస్యలపై వినతి స్వీకరణ

**కాకినాడ/రాజమండ్రి ,పెన్ పవర్,మార్చి 10:**మహిళల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఈ నెల 12వ తేదీన రాజమహేంద్రవరం నగరానికి రానున్నారని తూర్పు గోదావరి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి టి. శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు.మార్చి 12న ఉదయం రాజమహేంద్రవరం ఆర్ అండ్ బి అతిథి గృహానికి చేరుకుని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని తూర్పు గోదావరి,కాకినాడ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, పోలవరం (రంపచోడవరం) జిల్లాలకు చెందిన బాధిత మహిళల సమస్యలను స్వయంగా తెలుసుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి అతిథి గృహంలో నూతనంగా ఏర్పాటు చేసిన సమావేశ మందిరంలో మహిళల నుంచి వినతిపత్రాలను స్వీకరించ నున్నట్లు పేర్కొన్నారు. గృహ హింస, వేధింపులు మరియు ఇతర అన్యాయాలకు గురైన మహిళలు తమ ఫిర్యాదులను ఈ కార్యక్రమంలో సమర్పించవచ్చని తెలిపారు. అందిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఆధ్వర్యంలో సత్వర చర్యలు తీసుకొని వేగవంతంగా పరిష్కారం కల్పించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా యంత్రాంగం, న్యాయ విభాగం, పోలీసు శాఖ ప్రతినిధులు తదితరులు పాల్గొంటారని తెలిపారు. కావున కాకినాడ జిల్లా పరిధిలోని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# మహిళా విద్యకు మార్గదర్శి సావిత్రిబాయి పూలేకు ఘన నివాళులు

**రామచంద్రపురం, పెన్ పవర్,మార్చి 10:**విద్య ద్వారానే స్త్రీకి విముక్తి సాధ్యమని విశ్వసించి మహిళల హక్కుల కోసం పోరాడిన భారత తొలి మహిళా ఉపాధ్యాయిని, కవయిత్రి, సామాజిక ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే నేటి తరానికి ఆదర్శమని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం అన్నారు.ద్రాక్షారామంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయు రాలిగా సావిత్రిబాయి పూలే మహిళా విద్యాభివృద్ధికి చేసిన సేవలు అపారమని కొనియాడారు. సమాజంలో మహిళలకు విద్య అందేలా ఎన్నో అవరోధాలను ఎదుర్కొని పోరాడిన మహానుభావురాలు సావిత్రిబాయి పూలే అని అన్నారు. మహిళల సాధికారతకు, సమాన హక్కులకు ఆమె చేసిన కృషి భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.అలాంటి మహోన్నత మహిళను స్మరించుకోవడం ప్రతి ఒక్కరికీ గౌరవకరమని, ఆమె చూపిన మార్గంలో నడుస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌కేపీపీ ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు, తెలుగుదేశం పార్టీ రామచంద్రపురం పట్టణ ఉపాధ్యక్షులు చందమామ వాసు, ద్రాక్షారామం సొసైటీ అధ్యక్షులు ముప్పనపల్లి గణేష్, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు పెంకె సాంబశివరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ కంచుమర్తి బాబురావు, మాజీ కౌన్సిలర్ దంగేటి గౌరీశంకర్, యువ నాయకులు కుడుపూడి ఫణి తేజ, ప్రకాష్ కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## దుగ్గుదురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భాశయ క్యాన్సర్ నివారణ టీకాల ప్రారంభం



**కాజులూరు, పెన్ పవర్,మార్చి 10:**కాజులూరు మండలం దుగ్గుదురు గ్రామపంచాయతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భాశయ క్యాన్సర్ నివారణ కార్యక్రమంలో భాగంగా బాలికలకు టీకాలు వేయడం మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కాజులూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జె. రాంబాబు మాట్లాడుతూ మహిళల్లో ప్రాణాంతకంగా మారుతున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను అరికట్టేందుకు భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా బాలికలకు ఉచితంగా టీకాలు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించింద న్నారు. చిన్న వయసులోనే టీకా వేయించడం ద్వారా భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గించవచ్చని తెలిపారు.గ్రామస్థాయిలో ఈ విషయంపై విస్తృతంగా అవగాహన కల్పించి 14 నుండి 15 సంవత్సరాల లోపు ఉన్న బాలికలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ఈ టీకాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దుగ్గుదురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్యులు డాక్టర్ సుప్రియ, డాక్టర్ స్వాతి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జె. రాంబాబు, గ్రామపంచాయతీ సర్పంచ్ పి. వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు డి. శంకర్ నారాయణ, దుగ్గుదురు నీటి సంఘంఅధ్యక్షుడు చైతన్య, వైద్య సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆత్రేయపురం పీహెచ్సీలో ఆశా డే సందర్భంగా ఫైలేరియా పై అవగాహన సమావేశం

మలేరియా సబ్ యూనిట్ అధికారి చిటికెన వెంకటేశ్వరరావు





**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 10:**డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే సందర్భంగా ఫైలేరియా వ్యాధి నివారణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రావులపాలెం మలేరియా సబ్ యూనిట్ అధికారి చిటికెన వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధి దోమల ద్వారా ఎలా వ్యాప్తి చెందుతుందో, వ్యాధిని ఎలా అరికట్టాలో వివరించారు. ఫైలేరియా వ్యాధి నియంత్రణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధిగ్రస్తులకు డి.ఈ.సి మాత్రలను వయస్సు ఆధారంగా ఎంత మోతాదులో ఇవ్వాలో సిబ్బందికి వివరించారు. అలాగే దోమల వ్యాప్తిని అరికట్టేందుకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీరు ఉండకుండా చూడాలని సూచించారు."దోమ పుట్ట రాదు దోమ కుట్ట రాదు" అనే నినాదంతో గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో వైద్యాధికారిణులు డాక్టర్ పి. సౌమ్య, డాక్టర్ హైమశ్రీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ టీ. అరుణ కుమారి, వైద్య సహాయకులు ఎం.టి.వి.ఎన్. మూర్తి, జి. పద్మకుమారి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎం.ఎల్.హెచ్.పీలు పాల్గొన్నారు.

## కోలంక సహకార సంఘంలో 12న మహాజన సభ



**కాజులూరు, పెన్ పవర్,మార్చి 10:**కాజులూరు మండలం కోలంక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వార్షిక మహాజన సభ సమావేశం ఈ నెల 12వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు సంఘ కార్యాలయ భవనం వద్ద నిర్వహించనున్నట్లు సంఘ చైర్‌పర్సన్ బొండా వెంకట నరసింహనాయుడు తెలిపారు.

ఈ సందర్భంగా కోలంక, పెద్దలంక మరియు నామవానిపాలెం గ్రామాలకు చెందిన సంఘ సభ్యులు, రైతులు అందరూ మహాజన సభకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.సభలో సంఘానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక అంచనా బడ్జెట్ ఆమోదం, 202526 సంవత్సర పరిపాలనా నివేదిక సమీక్ష, సభ్యుల అప్పుల వాయిదా మీరిన బకాయిలపై సమీక్ష, సంఘం పాత భవనం పాడైపోవడంతో దానిని తొలగించి కొత్త భవనం నిర్మాణంపై చర్చ వంటి అంశాలు అజెండాలో ఉన్నట్లు తెలిపారు.

అలాగే చైర్‌పర్సన్ ప్రతిపాదించే ఇతర విషయాలపై కూడా సభలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సంఘ సభ్యులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# శ్రీ కోదండ రాముని ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలి.

-ప్రముఖ పారిశ్రామికవేత్త, బిల్డర్,సంపర సుధాకర్ శ్రీ వినాయక వర్మ.



**కిర్లంపూడి, పెన్ పవర్, మార్చి 10:** శ్రీ కోదండ రాముని ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త,బిల్డర్,గొప్ప ఆధ్యాత్మికవేత్త సంపర సుధాకర్ శ్రీ వినాయక వర్మ అన్నారు. కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోదండ రాముని ఆలయంలో నిర్వహిస్తున్న సప్త సప్తాహ మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కోదండ రాముని దర్శించుకోవడమే కాకుండా, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ కోదండ రాముని ఆలయానికి విచ్చేసిన సంపర సుధాకర్ శ్రీ వినాయక వర్మకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలనే ఉద్దేశంతో ఆలయ కమిటీ సభ్యులు సుమారు 49 వారాలపాటు సప్త సప్తాహ మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆ కోదండ రాముని ఆశీస్సులు ప్రజలందరిపైనా ఎల్లవేళలా ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, జగపతినగరం గ్రామస్తులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షన్‌లో కాకినాడకు మంచి ర్యాంకు సాధించాలి





**జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్**

**కాకినాడ, పెన్ పవర్,మార్చి 10:**కాకినాడ నగరం దేశవ్యాప్తంగా నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షన్‌లో మంచి ర్యాంకు సాధించేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్ ఆదేశించారు. మంగళ వారం కాకినాడ స్మార్ట్ సిటీ సమావేశ మందిరంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఘన చెత్త నిర్వహణ అవగాహన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటి వద్దనే కంపోస్ట్ యార్డ్‌ను ఎలా ఏర్పాటు చేసుకోవాలి, తడిపొడి చెత్తను వేరు చేసి నిర్వహించడం ద్వారా పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవచ్చనే అంశాలపై కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ అవగాహన కల్పించారు. గృహ స్థాయిలోనే చెత్తను వర్గీకరించడం, కంపోస్టింగ్ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా నగర పరిశుభ్రతను మరింత మెరుగు పరచవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్‌లో కాకినాడ నగరానికి మంచి ర్యాంకు వచ్చేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు చెత్త వర్గీకరణ,కంపోస్టింగ్ వంటి చర్యలను విస్తృతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలోని 233 మంది రిసోర్స్ పర్సన్లకు స్వచ్ఛ సర్వేక్షన్ కిట్లను జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్, కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కిట్ల ద్వారా రిసోర్స్ పర్సన్లు ప్రజల్లో పరిశుభ్రత,చెత్త నిర్వహణ, కంపోస్టింగ్ అంశాలపై మరింత అవగాహన కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.టి. సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్, డీసీపీ కృష్ణారావు, సిటీ మిషన్ మేనేజర్ డి. వెంకట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ. వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ప్రశాంతంగా ముగిసిన ఇంటర్మీడియట్ పరీక్షలు

**ఫిజిక్స్-1కు 18,432 మంది హాజరు**

**కాకినాడ, పెన్ పవర్,మార్చి 10:**కాకినాడ జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు2026లో భాగంగా మంగళవారం జరిగిన డే13 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించబడినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వి. కేశవరావు తెలిపారు. ఈ రోజు నిర్వహించిన ఫస్ట్ ఇయర్ ఫిజిక్స్1 పరీక్షకు మొత్తం 19,081 మంది విద్యార్థులు కేటాయించబడగా, అందులో 18,432 మంది హాజరై పరీక్ష రాశారు. 649 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా లోని అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా మధ్య కట్టుదిట్టమైన ఏర్పాట్లతో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఎటువంటి అక్రమ పద్ధతులు లేదా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని చెప్పారు. ఈ సందర్భంగా బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ నుంచి వచ్చిన ప్రత్యేక అధికారి జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. మొత్తంగా జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు సక్రమంగా, ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వి. కేశవరావు తెలిపారు.

## వైద్యాధికారిణి భాగ్యశ్రీ సేవలు అభినందనీయం

**డాక్టర్ సాయికిషోర్, వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రశంసలు వెల్లువ**

**పీజీ కోర్సుకు వెళుతున్న వైద్యాధికారిణి భాగ్యశ్రీకి సత్కారం**





**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 10;**మండలంలోని పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాధ్యతలు స్వీకరించిన అనతికాలంలోనే , క్షేత్రస్థాయిలో పేద ప్రజలకు అనిర్వచియమైన వైద్య సేవలను అందించి అందరి మన్నలను పొందిన వైద్యాధికారిణి కె.భాగ్యశ్రీ కృషి అభినందనీయమని వైద్యాధికారి డి.సాయికిషోర్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో వైదాధికారిణిగా పనిచేసి ఉన్నత చదువులు (పీజీ కోర్సు) కోసం ప్రభుత్వం తరపున గుంటూరు మెడికల్ కాలేజీకి వెళు తున్న వైద్యాధికారిణి భాగ్యశ్రీకి మంగళవారం ఘన సత్కారం జరిగింది. ఈసందర్భంగా పీహెచ్‌సీకి ఆమె అందించిన సేవలు, వృత్తి పట్ల కనబర్చిన నిబద్ధతను పలువురు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కొనియాడారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత చదువులు చదివి వీలైనంత మేరకు వైద్య సేవలను అందించి ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని వారు ఆకాక్షించారు. అనంతరం వైద్యాధికారిణి భాగ్యశ్రీకి దుశ్శాలువ కప్పి పూలమాలలు వేసి మెమోంటోను బహుకరించి ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, సూపర్‌వైజర్ ముద్రగడ శ్రీనివాసరావు, ఇంచార్జి హెల్త్ విజిటర్ కె.అనంతలక్ష్మి, ఫార్మాసిస్టు డి.సుగుణలక్ష్మి, ఎస్ఎన్‌లు ఎన్ లక్ష్మీ, కె.రత్నకుమారి, ఎం.సత్యవతి, ల్యాబ్ టెక్నీషియన్ పి,రాజారమేష్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్లు వి.సుబ్బారావు, ఆర్.నాగేశ్వరరావు, ఏవి కృష్ణారావు, వై.వెంకటేశ్వరరావు. ఆరోగ్య, ఆశ, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పొడగట్లపల్లిలో రూ.1 కోట్లతో అన్నదాన సత్రం భవనానికి శంకుస్థాపన





**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**

**రావులపాలెం పెన్ పవర్ మార్చి 10** :రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామంలో రాబోయే గోదావరి పుష్కరాల దృష్ట్యా యాత్రికులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రూ.1 కోట్ల వ్యయంతో నిర్మించనున్న శ్రీ ఉప్పలపాటి జానకి అమ్మ అన్నదాన సత్రం భవనానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ 2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. భక్తులకు అన్నదానం, విశ్రాంతి, త్రాగునీరు వంటి సౌకర్యాలు అందించేందుకు అన్నదాన సత్రం నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పుష్కరాల సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పుష్కర ఘాట్లను అభివృద్ధి చేయడంతో పాటు సమీపంలోని దేవాలయాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. యాత్రికులు సౌకర్యవంతంగా స్నానాలు చేసి దేవాలయ దర్శనం చేసుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నామని చెప్పారు. అదేవిధంగా పుష్కరాలకు సంబంధించిన అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం కూడా పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అవసరమైన నిధులను కేటాయిస్తూ చర్యలు తీసుకుంటోందన్నారు. పొడగట్లపల్లి గ్రామంలో నిర్మించనున్న అన్నదాన సత్రం పూర్తయిన తరువాత పుష్కరాల సమయంలో భక్తులకు ఎంతో ఉపయోగపడుతుందని స్థానికులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అధికారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## తితిదే వార్షిక సత్కారం స్వీకరించిన ఆలమూరు పండితులు




**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 10:**ఆలమూరు శైవాగమ పండితులు, ప్రఖ్యాత భట్టీవిక్రమార్కేశ్వర ఆలయ ప్రధానార్చకులు కాళ్ళకూరి సూరిపండు తిరుమల తిరుపతి దేవస్థానములు ప్రతిష్టాత్మకంగా అందించే వార్షిక సత్కారాన్ని మంగళవారం తిరుపతిలో జరిగిన వేదశాస్త్ర ఆగమ విద్యత్ సదస్సులో అందుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు 1969లో ప్రారంభించిన వేదశాస్త్ర ఆగమ విద్వత్ సదస్సులో భాగంగా చతుర్వేదాల మీద, ఆగమశాస్త్రాల మీద విద్వత్ పరీక్షలు నిర్వహించి అందులో ప్రతిభ చూపిన వారికి ఈ సత్కారం అందిస్తారు. 2006 నుంచి మొదలుకుని నేటివరకూ ఈ సత్కారాన్ని కాళ్లకూరి సూరిపండు ఆరోసారి అందుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన వేదపఠనం కార్యక్రమంలో ఆయన సహచర పండితులతో పాల్గొని వేదపఠనం చేశారు. కాళ్లకూరి సూరిపండుతో పాటు మండలం నుంచి పెనికేరు శివాలయం అర్చకులు సాంబశివశర్మ(దొరబాబు) సైతం ఈ సత్కారాన్ని అందుకున్నారు. సత్కారం అందుకున్న పండితులు ఇరువురిని ఆలమూరు మండలానికి చెందిన ప్రముఖులు అభినందించారు.

## ఇంటి పనులు చెల్లించి అధికారులకు సహకరించండి


✸ ప్రజల తో ఎంపీడీవో హరికృష్ణ సత్యారెడ్డి




**గండేపల్లి, పెన్ పవర్, మార్చి, 10:**నూరు శాతం ఇంటి పన్నుల చెల్లించి అధికారులకు సహకరించాలని స్థానిక ఎంపీడీవో హరికృష్ణ సత్యారెడ్డి కోరారు. మంగళవారం మండల పరిధి జెడ్ రాగంపేట గ్రామంలో ఇంటి పన్ను వసూళ్లపై స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పనులు నూరు శాతం చెల్లించి గ్రామ అభివృద్ధికి ప్రజలు తోడ్పడాలని సూచించారు. గ్రామాలలో ఇంటి పన్నువసులపై పంచాయతీ అధికారులు స్వయంగా ఇంటికి తిరిగి ఇంటి పనులు వసూలు చేస్తున్నారని ప్రజలు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు. అలాగే ఇంటి పన్ను చెల్లించని ఎడల నవ అధికారులు ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకురాబడతాయని హెచ్చరించారు. స్వచ్ఛ పంచాయతీ పేరిట యాప్ ద్వారా పన్నులు చెల్లించవచ్చని వెంటనే రసీదు పొందవచ్చునని తెలియజేశారు. ఇంటి పన్ను బకాయిలు పెరిగిపోయినందున గ్రామాల అభివృద్ధి కుట్టిపడుతుందన్నారు. అలాగే గ్రామాల లో ప్రజలతోపాటు గ్రామస్థాయి నాయకులు కూడా ఇంటి పనులు చెల్లించేందుకు సహకరించాలన్నారు. అంతేగాకుండా ప్రజలకు ఇంటి పనుల చెల్లింపు పై అవగాహన కల్పించాలని అన్నారు.
ఈయన వెంట డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్ , పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## రైతులకు మద్దతు ధర కల్పించడమే ప్రధాన లక్ష్యం

-అధికారులకు తాసిల్దార్ శ్రీనివాస్





**గండేపల్లి, పెన్ పవర్, మార్చి, 10:**రైతులకు ధాన్యం అమ్మకాలపై మద్దతు ధర కల్పించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని స్థానిక తాసిల్దార్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ధాన్యం కొనుగోలు పై నిర్వహించిన శిక్షణా తరగతులు లో మాట్లాడుతూ ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మంగా రైతుకు ధాన్యం మద్దతు ధర అందించేందుకు చర్యలు చేపట్టడం జరిగింది. ఈ ప్రక్రియ నూరు శాతం జరగాలంటే గ్రామస్థాయి నుండి అధికారులు కొనుగోలు రవాణా వంటివే కాకుండా మిగిలినవి కూడా వేలు వెంటనే ఆన్లైన్ చేయడం ద్వారా మిల్లర్లు తొందరగా రైతులకు డబ్బులు చెల్లిస్తారన్నారు. ఇవి జరగాలంటే ఈ ప్రక్రియకు నిర్దేశించిన అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. మద్దతు ధర ఎ గ్రేడ్ 75 కేజీలకు రూ.1792,కామన్ వెరైటీ రూ. 1777 గా నిర్ణయించడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఉద్యోగులు సెలవులు తీసుకోకుండా విధులు నిర్వహించడం ద్వారా రైతులకు మద్దతు ధరతో పాటు అమ్మిన ధాన్యానికి సొమ్ములు మిల్లర్ల ద్వారా వెను వెంటనే ఇప్పించే అవకాశం ఉంటుందన్నారు. తప్పనిసరిగా గ్రామస్థాయి నుండి అధికారులు కష్టపడి పనిచేసే రైతుల కష్టానికి ప్రతిఫలం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏం, సహకార సంఘాల ఉద్యోగులు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట.

- హెచ్ పి వి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన పిహెచ్సి చైర్మన్ గౌతు చినబాబు.



**కిర్లంపూడి,పెన్ పవర్, మార్చి 10:**మహిళల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని కిర్లంపూడి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గౌతు చిన్న అన్నారు.కిర్లంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో గర్భాశయ ముఖ క్యాన్సర్ (హెచ్ పి వి)వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ రాంబాబు నాయక్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గౌతు చినబాబు విచ్చేసి వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా గౌతు చినబాబు మాట్లాడుతూ 14 సంవత్సరాలు నిండిన బాలికలు తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వైద్యం సేవలందించడంలో ముందడుగు వేస్తున్నారన్నారు.డాక్టర్ రాంబాబు నాయక్ మాట్లాడుతూ వ్యాక్సిన్ వేయవలసిన బాలికలు సుమారు 128 మంది ఉన్నట్లు గుర్తించినట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి హేమాంజలి,పిహెచ్ఎన్ వైకె అన్నపూర్ణ,ఫార్మసీ ఆఫీసర్ బొల్లు గంగాధర్,జగపతినగరం ఉప సర్పంచ్ గౌతు జగన్నాధరావు,నాయకులు కాళ్ళ వెంకటేష్ ఎరికిరెడ్డి బాబ్జి,మాదిరెడ్డి సూరిబాబు,అనంతలక్ష్మి,రమణ ఏఎన్ఎంలు,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## కరాటేలో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 10;**గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో ఈ నెల 8న వాసవి గార్డెన్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన అంతర్జాతీయ ఓపెన్ కరాటే పోటీలలో ఆలమూరు మండల కేంద్రంలోని శ్రీ సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని అ స్కూల్ అధినేత కె.ముల్లారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం విజేతలను అభినందించి వివరాలు వెల్లడించారు. బ్లూబెల్ట్ ఎ విభాగంలో గుత్తుల షణ్ముఖ గోల్డ్ మెడల్, బ్లూ బెల్ట్ బి విభాగంలో గెద్దాడ జారు కిరణ్ సిల్వర్ మెడల్ సాధించారన్నారు. జూనియర్స్ ఎల్లో బెల్ట్ బి విభాగంలో కోడూరి శ్రీ ఉదయ కృష్ణ దుర్గ సాకేత్, పాలూరి చరణ్ సంతోష్ కుమార్ బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు ఆయనతో పాటు కోచ్ టీ.వెంకటలక్ష్మి వివరించారు. అలాగే విజేతలను అభినందించిన వారిలో ప్రిన్సిపల్ గుణశేఖర్, ప్రైమరీ ప్రిన్సిపల్ జెసినా, ఉపాధ్యాయులు ఉన్నారు.

## జేజేలు గురువు ఆధ్వర్యంలో శ్రీ వనదుర్గ అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్నదానం.



**కిర్లంపూడి,పెన్ పవర్, మార్చి 10**:కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలోని వీరవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ వనదుర్గ అమ్మవారి 9వ వార్షికోత్సవాన్ని జేజేలు గురువు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారికి భక్తి శ్రద్దలతో ప్రత్యేక పూజలు,అభిషేకాలు చేసారు.వీరవరం గ్రామంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు.ఈ సందర్భంగా జేజేలు గురువు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే మహిమ కలిగిన వనదుర్గ అమ్మవారి కరుణ కటాక్షాలు భక్తులందరిపై ఉండాలని కోరారు.భక్తి విశ్వాసాలతో అమ్మవారిని ఆరాధిస్తే జీవితంలో శుభఫలితాలు కలుగుతాయని ఆయన తెలిపారు.ఆలయ పురోహితులు సూర్య దత్త శర్మ, మోహన్ దత్త శర్మలు మాట్లాడుతూ వరుసగా 9 వారాలు భక్తిశ్రద్ధలతో వనదుర్గ అమ్మవారిని పూజిస్తే సంతాన ప్రాప్తి కలిగి,కోరిన కోర్కెలు నెరవేరుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కర్రి శ్రీను,చింతల సత్యాలు,చింతల విజయ్,కర్రి సాయి,అంబాసల దొరబాబు,మరోతి వీరస్వామి,పుర్రె రాంపండు,దంటా సుబ్బారావు ,మర్రి సుబ్బారావు,వెలుగుల సూరిబాబు,దంటా సూరిబాబు,అంబాసల యువరాజు,సిరిపురపు రామశ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నూతన పాఠశాల భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందరావు







**అల్లవరం,పెన్ పవర్, మార్చి 10:**అల్లవరం మండలం తూర్పులంక గ్రామంలో సుమారు 80 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన రోడ్డును ప్రజలకు అంకితం చేయడంతో పాటు, సుమారు 12 లక్షలు తో ఎంపీపీ పాఠశాల నూతన భవనాన్ని అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ,రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా ప్రమాణాలను పెంచి, దేశంలోనే మన పాఠశాలలు, కళాశాలలను అగ్రస్థానంలో నిలిపేందుకు చేస్తున్న కృషిని కొనియాడారు.రాష్ట్రంలోని 63 లక్షల మంది విద్యార్థుల్లో సగానికి పైగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారని,వారందరికీ నాణ్యమైన యూనిఫామ్స్, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు, పేరెంట్-టీచర్ మీటింగ్స్ ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నారని తెలిపారు. ఒకపక్క విద్యాశాఖను ప్రక్షాళన చేస్తూనే,మరోపక్క విదేశీ పెట్టుబడులను ఆకర్షించి యువతకు ఉపాధి కల్పించేలా మంత్రి లోకేష్ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారంపై మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో ప్రతి ప్రాంతానికి రక్షిత మంచినీరు అందించే ప్రాజెక్టును చేపట్టామని తెలిపారు. మొదటి విడతలో గన్నవరం,రాజోలు నియోజకవర్గాల్లో పనులు జరుగుతున్నాయని,రెండో విడతలో అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాలను చేర్చామని స్పష్టం చేశారు. రాబోయే 10 నెలల్లో నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికి సంపూర్ణంగా మంచినీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. తూర్పులంక గ్రామంలో ఇప్పటికే 80 లక్షలతో రోడ్డు నిర్మాణం పూర్తి చేశామని, గ్రామంలో ఉన్న మంచినీటి సమస్యను కూడా త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. 'అభివృద్ధి సంక్షేమమే'ఆశయంగా పనిచేస్తున్న తనను ఆశీర్వదిస్తున్న నియోజకవర్గ ప్రజలకు, నిరంతర అభివృద్ధి పనుల ద్వారానే జవాబుదారీగా ఉంటానని ఎమ్మెల్యే ఆనందరావు పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలోఎంపిపి ఇళ్ల శేషారావు జడ్పీటీసీ కొనుకు గౌతిమి, కార్పొరేషన్ డైరెక్టర్ కదలి వెంకటేశ్వరరావు,సర్పంచ్ గంగచలం,టీడీపి మండల అదుక్షలు సత్తిబాబు రాజు, ప్రధాన ఉపాధ్యాయులు మల్లప రాజు, ఇతర ఉపాధ్యాయలు కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరి పంటలో జాగ్రత్తలు పాటించాలి



**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 10 :** ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి పంటను ఆశించే చీడపీడల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ సంచాలకుడు ఎన్. విజయకుమార్ సూచించారు. మండల పరిధిలోని వడ్లమూరు, గోరింట గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి, వరి, మొక్కజొన్న, చిరు సంచుల ప్రదర్శన క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో ముఖాముఖి మాట్లాడి పలు సూచనలు చేశారు. వాతావరణ మార్పుల వల్ల వరిలో మొవ్వు తొలిచే పురుగు (మొవ్వు పోటు), దోమపోటు అధికంగా సోకే ప్రమాదం ఉందని, రైతులు ఎప్పటికప్పుడు పొలాలను గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వరి ప్రస్తుతం అంకురం దశలో ఉన్నందున, తప్పనిసరిగా పొటాష్ ఎరువును వినియోగించాలని, దీనివల్ల మొక్కకు రోగనిరోధక శక్తి పెరిగి తెగుళ్లు, పురుగులను తట్టుకుంటుందని వివరించారు. ప్రభుత్వ పథకాలు పొందేందుకు ప్రతీ రైతు ఏపీ ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని, నమోదు చేసుకున్న వారికి 11 అంకెల విశిష్ట సంఖ్య కేటాయించబడుతుందన్నారు. రాబోయే రోజుల్లో పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, సబ్సిడీ ఎరువులు, ఇన్ పుట్ సబ్సిడీ వంటి ప్రయోజనాలన్నీ ఈ నంబర్ ఆధారంగానే అందుతాయని వెల్లడించారు. ఇంకా రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులు తమకు సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.ప్రభుత్వం అందిస్తున్న 'ఉబెరైజేషన్' సౌకర్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, డ్రోన్ల ద్వారా పురుగుమందుల పిచికారీ చేయించుకోవడం వల్ల సమయం, ఖర్చు ఆదా అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కొమ్మోజు సంజయ్ కుమార్, దేవళ్ళ సతీష్ కుమార్, నీటి సంఘం అధ్యక్షుడు దేవళ్ళ బోసు, దూసర్లపూడి ఏసుబాబు, ఏఎంసీ డైరెక్టర్ జలధానిని సుబ్రహ్మణ్యం, కర్రి భాస్కరరాజు, పచ్చిపాల ఏసు, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాపురం మున్సిపాలిటీకి 'స్పెషల్ గ్రేడ్' హోదా





**రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ**

**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 10:** చారిత్రక పట్టణం కాకినాడ జిల్లాలోని కీలక పురపాలక సంఘమైన పెద్దాపురానికి రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. పెద్దాపురం మున్సిపాలిటీని 'స్పెషల్ గ్రేడ్' (ప్రత్యేక శ్రేణి) మున్సిపాలిటీగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన జనాభా, ఆదాయ వనరులు, మౌలిక సదుపాయాల అభివృద్ధిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది

పదోన్నతికి ప్రధాన కారణాలు

గత కొన్నేళ్లుగా పెద్దాపురం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. మున్సిపాలిటీ వార్షిక ఆదాయం నిర్దేశిత పరిమితిని దాటడం.

జనాభా పెరుగుదల, పట్టణ విస్తరణతో పాటు జనాభా గణనీయంగా పెరగడం, పారిశ్రామికాభివృద్ధి, చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక ప్రాంతాల ప్రభావం వల్ల మున్సిపాలిటీ ప్రాధాన్యత పెరిగింది.

ఒనగూరే ప్రయోజనాలు

స్పెషల్ గ్రేడ్ హోదా దక్కడం వల్ల పెద్దాపురం పట్టణ రూపురేఖలు మారనున్నాయి. అధిక నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పట్టణాభివృద్ధికి భారీగా నిధులు మంజూరవుతాయి. అధికారుల నియామకం, పరిపాలనా సౌలభ్యం కోసం ఉన్నత స్థాయి అధికారులు, అదనపు సిబ్బందిని ప్రభుత్వం నియమిస్తుంది. మౌలిక సదుపాయాలు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి సరఫరా, పార్కుల అభివృద్ధికి మరిన్ని అవకాశాలు మెరుగుపడతాయి.

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పెద్దాపురం మున్సిపాలిటీకి ప్రత్యేక శ్రేణి హోదా లభించడం పట్ల పట్టణ ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ హోదాతో పెద్దాపురం మరింత ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దబడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఫిజియోథెరపీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 10 :** దివ్యాంగ చిన్నారులు, మానసిక వైకల్య బాధిత పిల్లలు విద్య, ఆరోగ్యపరంగా వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన భవిత కేంద్రాలలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి వి.ఆర్.కె. చౌదరి అన్నారు. పెద్దాపురం పట్టణంలో స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఏవిధంగా విద్యను బోధిస్తున్నారు, వైద్య శిబిరం వివరాలను అక్కడ సిబ్బందిని ఎంఈవో అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు చికిత్స, సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసిందని, వివిధ కారణాలతో దివ్యాంగులైన చిన్నారుల బంగారు భవిష్యత్‌కు వీటి ద్వారా భరోసా ఇస్తోందని, వైకల్యాన్ని జయించి వారు జీవితంలో రాణించేందుకు మార్గం చూపుతోందని తెలిపారు. భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అన్ని రకాల సౌకర్యాలు అందించాలని, అలాగే మండల పరిధిలోని మూడు నుంచి 18 సంవత్సరాల వయస్సు గల శారీరకవైకల్యం గల పిల్లలందరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కె. పద్మశ్రీ, భవిత సిబ్బంది బి. దుర్గాప్రసాద్ రెడ్డి, బి. ఆనందరావు, సిజివి పి. దేవి, ఫిజియోథెరపిస్టు డాక్టర్ అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక రేణువుల్లో ఒలికిన మాతృత్వం...

## వంద వారాల అపురూప ప్రయాణం!





**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 10 :** సాధారణంగా ఇసుకతో బొమ్మలు వేస్తే అలలు వచ్చి తుడిచేస్తాయి. కానీ, పెద్దాపురం గ్రూప్ సాగిస్తున్న 'మాతృత్వం' అనే ఈ సేవా యజ్ఞం వంద వారాలు పూర్తి చేసుకున్నా, అది ప్రజల హృదయాల్లో చెదరని ముద్ర వేసింది. ఈ అపురూప సందర్భాన్ని పురస్కరించుకుని ప్రముఖ సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ రూపొందించిన శాండ్ ఆర్ట్ ఇప్పుడు అందరినీ మంత్రముగ్ధులను చేస్తోంది. కేవలం ఇసుక తిన్నెలే సాక్షిగా, ఒక తల్లి తన బిడ్డను అక్కున చేర్చుకున్న తీరును శ్రీనివాస్ అత్యంత భావోద్వేగ భరితంగా మలిచారు. ఆ శిల్పంలోని తల్లి కళ్లలో కనిపిస్తున్న ప్రశాంతత, బిడ్డ స్పర్శలో ఉన్న అమాయకత్వం చూస్తుంటే.. అది కేవలం ఇసుక బొమ్మ కాదు, అమ్మ ప్రేమకు ప్రతిరూపం అనిపిస్తోంది. అక్షరాలతో చెప్పలేని అమ్మ ప్రేమను, దేవిన శ్రీనివాస్ తన వేలి కొనలతో ఇసుకపై అద్భుతంగా ఆవిష్కరించారు. ఈ శిల్పం పెద్దాపురం గ్రూప్ ఆశయానికి అద్దం పడుతోంది.


Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# 'బలమైన' హామీ సాకారానికి లోకేష్ భూమి పూజ!

**హైదరాబాద్ పెన్ పవర్:** గత ఎన్నికలకు ముందు మంగళగిరి నియోజకవర్గం ప్రజలకు ఇచ్చిన హామీలను మంత్రి నారా లోకేష్ నెరవేరుస్తున్నారు. తాజాగా గత ఎన్నికల సమయంలో ఇక్కడి నదీతీర ప్రాంతం వాసుల సమస్యలు పరిష్కరించేందుకు రిటైనింగ్ వాల్ నిర్మిస్తామని చెప్పారు. దీనికి సంబంధించి తాజాగా భూమి పూజ చేయడం గమనార్హం. తాడేపల్లి రిటైనింగ్ వాల్‌కు శంకుస్థాపన చేయడంతో స్థానికంగా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఈ రక్షణ గోడ నిర్మాణానికి 294 కోట్ల రూపాయలు ఖర్చుచేయనున్నారు.మంగళగిరి నియోజకవర్గం పరిధిలోని తాడేపల్లిలో ప్రకాశం బ్యారేజీ దిగువన రెండున్నర కిలో మీటర్ల మేరకు కృష్ణా నది కుడివైపున ఈ వరద రక్షణ గోడను నిర్మించనున్నారు. ఇది ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి లోకేష్ పెద్దపీట వేసినట్టు అయింది. దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న ఈ ప్రాజెక్ట్ కు కేవలం ఏడాది కాలంలోనే 294 కోట్ల రూపాయల పరిపాలన అనుమతులు సాధించడమే కాకుండా టెండర్ ప్రక్రియను కూడా పూర్తిచేశారు. భవిష్యత్ లో భారీ వరదలను దృష్టిలో పెట్టుకుని 15 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని తట్టుకునేలా పటిష్టమైన డిజైన్ తో రిటైనింగ్ వాల్ ను నిర్మించనున్నారు.

**బలమైన కట్టడం!**

కేవలం సాధారణ గోడగా కాకుండా భూమి లోపల 26 నుంచి 38 మీటర్ల లోతు వరకు 1,920 పైల్స్ వేసి, పైల్- రాఫ్ట్ సాంకేతికతతో భూకంపాలను, నీటి ఉధృతిని తట్టుకునేలా నిర్మించనున్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తైతే సుందరయ్య నగర్, మహానాడు కాలనీ వంటి లోతట్టు ప్రాంతాల్లో నివసించే దాదాపు 50 వేల మంది ప్రజలు వరద భయం నుంచి శాశ్వతంగా విముక్తి పొందుతారు. అమరావతి రాజధాని పరిధిలోని కీలక ప్రాంతాలకు, జాతీయ రహదారి-65కు రక్షణగా రిటైనింగ్ వాల్ నిలవనుంది.




03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఇరాన్-ఇజ్రాయిల్ వార్ : ఏపీ ఎగుమతిదారులకు లాస్, ఎలా అంటే?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయల్ కొనసాగిస్తున్న యుద్ధంతో ఏపీ రైతులు కుదేలవుతున్నారు. యుద్ధం కారణంగా పశ్చిమాసియాకు ఎగుమతి కావాల్సిన ఆహారోత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు చెబుతున్నారు. ఒక్క ఏపీ మాత్రమే కాకుండా తెలంగాణ, హరియాణా, కర్ణాటక, పంచాబ్, మహారాష్ట్రకు చెందిన రైతులు కూడా నష్టపోతున్నారని మార్కెట్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏపీ నుంచి రొయ్యలు, బియ్యం పెద్ద ఎత్తున పశ్చిమాసియాకు ఎగుమతి చేస్తుంటారు. అదేవిధంగా పండ్లు, కూరగాయలు, చేపలు, మాంసం ఉత్పత్తులు సైతం ఆయా రాష్ట్రాల నుంచి ఎగుమతి అవుతుంటాయి. యుద్ధంతో హోర్ముజ్ జలసంధి మూసివేయడంతో పోర్టుల్లో సరుకు పేరుకుపోయిందని అంటున్నారు.మన దేశ మొత్తం వ్యవసాయ ఎగుమతుల్లో ఐదు వంతు పశ్చిమాసియా దేశాలకు వెళుతోందని చెబుతున్నారు. గత ఏడాది పశ్చిమాసియా దేశాలకు భారత్ నుంచి ఒక లక్షా 8 వేల 898 కోట్ల రూపాయల విలువైన వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. ఇందులో దాదాపు 40 వేల కోట్ల రూపాయల విలువైన బియ్యం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ఎగుమతి చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. హార్మోజ్ జలసంధి మూసివేయడంతో ఆ మార్గం గుండా సరుకు రవాణా చేసే నౌకల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో మన దేశంలోని పోర్టుల్లో 4 లక్షల టన్నుల బాస్మతి బియ్యం నిల్వలు పేరుకుపోయినట్లు చెబుతున్నారు.ముఖ్యంగా కొన్ని నౌకలు నడి సంద్రంలో ఉండిపోయాయి. యుద్ధం మరికొంతకాలం కొనసాగితే నౌకల్లో ఉన్న రొయ్యలు, చేపలు, మాంసం ఉత్పత్తులు పాడయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మనం ఉత్పత్తి చేసే బాస్మతి బియ్యం ఎక్కువగా సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్ దేశాలు కొనుగోలు చేస్తున్నాయి. యుద్ధం వల్ల ఆ దేశాలకు బాస్మతి బియ్యం ఎగుమతి సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ప్రత్యామ్నాయ మార్కెట్లకు ఆ సరుకును తరలించే అవకాశం కనిపించడం లేదు. దీంతో స్థానికంగా ధరలు పతనమయ్యే ప్రమాదంతోపాటు రైతులకు కనీసం పంట ఉత్పత్తికి అయ్యే ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యుద్ధం వల్ల మన దేశం నుంచి దుబాయ్, ఇతర అరబ్ దేశాలకు ఎగుమతి అయ్యే పండ్లు, మాంసం ఉత్పత్తులు, గుడ్లు, పాలు వంటి ఎగుమతులు నిలిచిపోయాయని అంటున్నారు. యుద్ధం ప్రారంభం కాకముందు నుంచే ఉద్రిక్తతల కారణంగా ఎగుమతులు 50 శాతం క్షీణించాయి. యుద్ధం మొదలైన తర్వాత ఇవి పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో పండ్లు, గుడ్లు, మాంసం ఉత్పత్తుల ధరలు పతనమయ్యే పరిస్థితి కనిపిస్తోందని ఆందోళన వ్యక్తమవుతోంది.

**రంజాన్ వేళ.. ఎగుమతుల్లో స్తబ్దత**

మన దేశం నుంచి ఎగుమతి అవుతున్న మాంసం, రొయ్యలు, పండ్లు, కూరగాయలు గల్ఫ్ దేశాలకు నిలిచిపోయాయి. దీంతో ఆయా దేశాల్లో రంజాన్ వేళ స్టాక్ తగ్గిపోయి స్తబ్దత ఏర్పడిందని అంటున్నారు. రంజాన్ సమయంలో ఇఫ్తార్ విందులో భాగంగా ఎక్కువగా మాంసం, పండ్లు వినియోగిస్తారు. యుద్ధం కారణంగా ముస్లిం దేశాలు అయిన ఓమన్, కువైట్, సౌదీ, దుబాయ్ వంటి దేశాల నుంచి ఆర్డర్లు లేవని, నౌకలు కూడా అటువైపు వెళ్లడం లేదని చెబుతున్నారు. ఇదేసమయంలో పోర్టుల్లో నిలిచిపోయిన నౌకలు డెమరేజ్ చార్జీల భారం తడిపిమోపెడు అవుతోందని ఆవేదన చెందుతున్నారు. దీంతో ఎడాపెడా నష్టాలు ఎదురవుతున్నాయని స్థానికంగా రైతులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# హీరో శివాజీ.. అవసరమా ఈ మాటలు?

**హైదరాబాద్ పెన్ పవర్:** స్క్రిప్ట్ ప్రకారం అయితే ఆయనకు ఇప్పుడు కావాల్సింది మంచి పాత్రలు, హిట్ సినిమాలు... కానీ కెమెరా ముందు నటన కన్నా కెమెరా వెనుక రాజకీయ విమర్శలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లున్నారు నటుడు శివాజీ. సినిమాలో విలన్‌ని ఎదుర్కోవడం ఎంత బాగుంటుందో రాజకీయాల్లోకి వెళ్లకుండానే విలనిజాన్ని ఎంచుకోవడం అంతకంటే రిస్క్ అని ఈయన ఎప్పుడు గుర్తిస్తారో! తెలుగు సినీ పరిశ్రమలో తనదైన శైలి నటనతో సహజమైన డైలాగ్ డెలివరీతో ఒకప్పుడు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు శివాజీ. సుదీర్ఘ విరామం తర్వాత 'బిగ్ బాస్' వంటి కార్యక్రమాల ద్వారా మళ్లీ పాపులర్ అయిన ఆయన ఇప్పుడు సినిమాల్లో కూడా బిజీ అవుతున్నారు. అయితే ఒక నటుడిగా తన రెండో ఇన్నింగ్స్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్న శివాజీ.. ప్రస్తుతం తెరపై కంటే తెర వెనుక రాజకీయ చర్చల వల్లనే ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై ఆయన చేస్తున్న సంచలన వ్యాఖ్యలు, ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఉద్దేశించి ఆయన చేస్తున్న విమర్శలు ఇప్పుడు సినీ, రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీస్తున్నాయి.

**రాజకీయ నిష్పాక్షపాతం.. ఆచరణలో ప్రశ్నార్థకం?**

శివాజీ తాను ఏ రాజకీయ పార్టీకి చెందినవాడిని కాదని.. తనకు ఏ పార్టీతోనూ అంటకాగాల్సిన అవసరం లేదని పదే పదే చెబుతుంటారు. కానీ ఆయన మాటలు మాత్రం పరోక్షంగా ఒక నిర్దిష్ట రాజకీయ పక్షానికి... అంటే తెలుగుదేశం పార్టీకి మద్దతుగా ఉన్నాయనే భావన రాజకీయ పరిశీలకుల్లో బలంగా వ్యక్తమవుతోంది. ఒక నటుడిగా ప్రజా సమస్యల మీద స్పందించడం తప్పు కాదు... కానీ తన మాటలు రాజకీయంగా ఒక పక్షానికి అనుకూలంగా, మరొక పక్షానికి వ్యతిరేకంగా ఉండటం వల్ల ఆయన 'నిష్పాక్షపాతం'పై అనుమానాలు మొదలయ్యాయి. ఒకరిని విమర్శించడం, సవాళ్లు విసరడం వంటివి ఆయన ఇమేజ్‌ను ఒక 'పొలిటికల్ యాక్టివిస్ట్' స్థాయికి తీసుకువెళ్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

**రెండో ఇన్నింగ్స్.. సినిమాలపైనే దృష్టి పెట్టాల్సిన సమయం**

ప్రస్తుతం శివాజీకి నటుడిగా మంచి అవకాశాలు వస్తున్నాయి. క్యారెక్టర్ ఆర్టిస్టుగా, కీలక పాత్రల్లో ఆయన తన ప్రతిభను చాటుకుంటున్నారు. ప్రేక్షకుల్లో కూడా ఆయనపై ఒక సానుకూల దృక్పథం పెరుగుతోంది. ఇలాంటి కీలక తరుణంలో సినిమాలపై, తన నటనపై పూర్తి దృష్టి పెట్టాల్సిన శివాజీ అనవసరమైన రాజకీయ వివాదాల్లో తలదూర్చడం వల్ల కలిగే లాభం ఏమిటనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్న. రాజకీయ వ్యాఖ్యల వల్ల ఆయనకు లభించే క్రేజ్ తాత్కాలికం కావచ్చు కానీ ఒక నటుడిగా ఆయనకు వచ్చే గుర్తింపు చిరస్థాయిగా ఉంటుంది. వివాదాలు నటుడిని నటుడిగా కాకుండా ఒక వర్గానికి ప్రతినిధిగా చూసే ప్రమాదం ఉంది. ఇది ఆయన సినీ కెరీర్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని పలువురు సినీ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

**సోషల్ మీడియా హోరు..వాస్తవ పరిస్థితి ఏమిటి?**

నేటి కాలంలో సోషల్ మీడియాలో ఏ చిన్న వ్యాఖ్య చేసినా దానికి అనంతమైన ప్రతిస్పందనలు వస్తుంటాయి. శివాజీ రాజకీయ వ్యాఖ్యలకు సోషల్ మీడియాలో కొన్ని వర్గాల నుంచి భారీ మద్దతు లభిస్తోంది. అయితే ఈ మద్దతు ఇచ్చేది నిజమైన అభిమానులా లేక రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేసే వర్గాలా అన్నది అంతుచిక్కని ప్రశ్న. ఇలా సోషల్ మీడియాలో పరస్పర విమర్శలు, రెచ్చగొట్టుకోవడం వల్ల సామాజికంగా లేదా రాజకీయంగా ఎటువంటి ప్రయోజనం చేకూరదని చివరికి ప్రత్యర్థులకు అనవసరమైన పబ్లిసిటీని కట్టబెట్టడమే అవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**కెరీర్‌పైనే మక్కువ చూపితేనే మంచిది!**

ప్రజాస్వామ్యంలో ప్రతి వ్యక్తికి తమ అభిప్రాయాలను వెల్లడించే హక్కు ఉంది. అయితే ఒక బాధ్యతాయుతమైన నటుడిగా, లక్షలాది మంది అభిమానులు ఉన్న వ్యక్తిగా శివాజీ తన వ్యాఖ్యల వల్ల కలిగే పరిణామాలను ఆలోచించుకోవాలి. రాజకీయాల్లోకి వెళ్లకపోయినా రాజకీయ వ్యాఖ్యలు చేయడం వల్ల వచ్చే వివాదాలు కెరీర్‌ను దెబ్బతీస్తాయి. ఇప్పటికైనా ఆయన రాజకీయ వివాదాలకు దూరంగా ఉండి.. తన నటనతో ప్రేక్షకులను అలరించడంపైనే దృష్టి సారిస్తే బాగుంటుందనేది మెజారిటీ అభిమానుల ఆకాంక్ష. నటుడిగా ఆయనకు ఉన్న సహజమైన ప్రతిభ, ప్రేక్షకుల్లో ఉన్న ఆదరణ ఆయనకు మంచి భవిష్యత్తును అందిస్తాయి. శివాజీ తన కెరీర్ పట్ల మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తారనేది అందరి ఆశ.

# ఇది ఏపీ పోలీసు రివేంజ్? బిహార్ లో దెబ్బకు రిటర్న్ గిఫ్ట్?

**హైదరాబాద్ పెన్ పవర్:** డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో బిహార్ కేడర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ విచారణపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. హైకోర్టు సూచనల ప్రకారం సునీల్ నాయక్ ను గత ఐదు రోజులుగా విజయనగరం ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలోని ప్రత్యేక పోలీసు అధికారుల బృందం విచారిస్తోంది. అంతేకాకుండా విచారణను మరో మూడు రోజులు పొడిగించింది. దీంతో బిహార్ లో ఎదురైన అవమానానికి రివేంజ్ తీర్చుకునేలా, రిటర్న్ గిఫ్ట్ ఇచ్చేలా సిట్ పోలీసులు సునీల్ నాయక్ విచారణను కొనసాగిస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.బిహార్ లో సునీల్ నాయక్ ను అరెస్టు చేసేందుకు వెళ్లిన ఏపీ పోలీసు బృందానికి అక్కడ హోంగార్డులు ఇబ్బందులు సృష్టించారని, ఘర్షణ వైఖరి అవలంబించి కస్టడీలో ఉన్న సునీల్ నాయక్ ను తమతో తీసుకువెళ్లిపోయారని చెబుతున్నారు. అంతేకాకుండా ఓ మహిళా అధికారి ఇష్టానుసారం తిట్టారన్న ప్రచారం జరిగింది. దీనిపై రివేంజ్ తీర్చుకునేలా ప్రస్తుతం సునీల్ నాయక్ విచారణ కొనసాగుతోందా? అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. పోలీసు విచారణను పరిశీలిస్తే గతంలో సిట్ అధికారులు ఎదుర్కొన్న పరాభవానికి ఇప్పుడు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చేలా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సునీల్ నాయక్ ను అరెస్టు చేయాలనే పట్టుదల పోలీసు అధికారుల్లో కనిపిస్తోందని, అందుకే బెయిలు తీర్పు వచ్చే వరకు విచారణను పొడిగిస్తూ వస్తున్నారని న్యాయవాద వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.రఘురామరాజు అరెస్టు సమయంలో సునీల్ నాయక్ డీఐజీగా ఉన్నారు. అప్పట్లో ఏం జరిగింది? సునీల్ నాయక్ కు ఏం తెలుసు అన్న విషయాలపై సుదీర్ఘంగా విచారణ జరుగుతోంది. అయితే ఇదే కేసులో నిందితుడు అయిన మరో సీనియర్ అధికారి పీ.వీ.సునీల్ కుమార్ ను కేవలం ఒక రోజు, అది కూడా కేవలం నాలుగు గంటల పాటు విచారించి వదిలేశారని గుర్తు చేస్తున్నారు. కానీ ఐపీఎస్ సునీల్ నాయక్ విషయంలో మాత్రం సిట్ పోలీసులు రోజుల తరబడి విచారణ కొనసాగించడమే ఇంట్రెస్టింగు డిస్కషన్ కు తెరతీస్తోంది. ఆయన వ్యవహారశైలిపై ఏపీ పోలీసు అధికారులు గుర్రుగా ఉన్నారని, అందుకే విచారణను సుదీర్ఘంగా కొనసాగిస్తూ తమ చుట్టూ సునీల్ నాయక్ తిరిగేలా చేస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.బిహార్ రాజధాని పట్నాలో సునీల్ నాయక్ ను గతంలో ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. అయితే నిబంధనలను చూపి ట్రాన్సిట్ వారెంట్ జారీ కాకుండా అక్కడి పోలీసులు సునీల్ నాయక్ ను ఏపీ తరలించకుండా అడ్డుకున్నారు. అంతేకాకుండా ఆ సమయంలో ఏపీ పోలీసులపై ఎదురు కేసులు పెట్టడం, ఒకానొక సమయంలో దాడికి ప్రయత్నించినట్లు ప్రచారం జరిగింది. దీనిని స్థానిక కోర్టు దృష్టికి తీసుకువెళ్లిన పోలీసులు సునీల్ నాయక్ ను విచారించేందుకు అనుమతి తీసుకున్నారు. దీంతో ఈ నెల 5వ తేదీ నుంచి ఆయన రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గుంటూరు సీసీఎస్ పోలీసుస్టేషన్ లో విచారణకు హాజరవుతున్నారు. తొలుత 9వ తేదీవరకు సునీల్ నాయక్ విచారణకు కోర్టు అనుమతి ఇచ్చింది. ఆయన విచారణకు సహకరించడం లేదని కోర్టు దృష్టికి తీసుకువెళ్లడంతో మరో మూడు రోజులు సిట్ ఎదుట హాజరు కావాలని కోర్టు సూచించింది. దీంతో ఈ నెల 12వ తేదీ వరకు సునీల్ నాయక్ విచారణ కొనసాగుతుందని చెబుతున్నారు.ఇదంతా పరిశీలిస్తే గతంలో విచారణకు హాజరుకాకపోవడం, బిహార్ లో తమకు సహకరించకపోవడాన్ని సిట్ పోలీసులు సీరియస్ గా తీసుకున్నట్లు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ కారణంగానే సీనియర్ అధికారిని విచారణ పేరుతో రోజూ తమ వద్దకు రప్పించుకుంటున్నారని అంటున్నారు. సునీల్ నాయక్ ముందస్తు బెయిలుపై హైకోర్టు తీర్పు వచ్చేవరకు ఈ పరిస్థితి కొనసాగుతుందని అభిప్రాయపడుతున్నారు. హైకోర్టులో సునీల్ నాయక్ ముందస్తు బెయిలుపై తీర్పు వచ్చిన తర్వాత అరెస్టు చేయాలా? వద్దా? అని నిర్ణయం తీసుకుని విచారణ ముగిస్తారని అంటున్నారు. దీంతో మరో రెండు రోజులు కూడా సునీల్ నాయక్ విచారణ కొనసాగుతుందని, 12వ తేదీన హైకోర్టు ఆదేశాలతో ఈ పరిస్థితిలో మార్పు రావొచ్చని అంటున్నారు.



# పశ్చిమ ప్రకాశం లో వైసీపీ వీక్ అయిందా ?

**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీకి భారీ ఓటమి బాధలు ఇంకా తీరలేదా అన్న చర్చ నడుస్తోంది. ఎందుకంటే ఆ పార్టీకి కీలకమైన జిల్లాలలో ఇంకా కోలుకోకపోవడమే అని అంటున్నారు. ఇక జగన్ అంటేనే పశ్చిమ ప్రకాశంగా చెబుతారు.అలాగే పశ్చిమ ప్రకాశం అంటే జగన్ అనే విధంగా అక్కడ రాజకీయం ఉంటుంది. అలాంటి పశ్చిమ ప్రకాశంలో ఇపుడు వైసీపీ రాజకీయాలు భిన్నంగా సాగుతున్నాయని అంటున్నారు. పశ్చిమ ప్రకాశం మార్కాపురం జిల్లాగా మారింది. మొత్తం నాలుగు నియోజకవర్గాలు ఈ జిల్లాలో ఉన్నాయి. ఇక ఇందులో మూడు జనరల్ ఓసీ అయితే ఒకటి ఎస్సీగా ఉంది. అదే ఎర్రగొండపాలెం. ఇక మిగిలినవి చూస్తే మార్కాపురం, గిద్దలూరు, కనిగిరిగా ఉన్నాయి.

**వారిదే డామినేషన్ :**

ఇక చూస్తే పశ్చిమ ప్రకాశంలో రెడ్డి సామాజిక వర్గానిదే డామినేషన్ అంటారు. అంటే జనాభా పరంగా వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. కానీ ఇక్కడ జగన్ అమలు చేస్తున్న స్ట్రాటజీ అయితే ఏ మాత్రం వర్కౌట్ కావడంలేదు అని అంటున్నారు. కనిగిరిలో పూర్తిగా రెడ్లు ఉంటారు. కానీ అక్కడ సీటు యాదవ సామాజిక వర్గానికి జగన్ ఇచ్చారు. టీడీపీ తరఫున రెడ్డి అభ్యర్థి ఉన్నారు. దాంతో సామాజిక వర్గం సమీకరణలతో రెడ్డికే అంతా జై కొట్టారు. అయితే ఇక్కడ యాదవ సామాజిక వర్గం కూడా మూడవ ప్లేస్ లో ఉంది. అయితే ఇక్కడ ఓటర్లలో కానీ మార్కాపుపురంలో కానీ పూర్తిగా రెడ్లే ఉంటారు. అలాగే అక్కడ వైశ్య సామాజిక వర్గానికి సీటు ఇస్తే టీడీపీ రెడ్లకు ఇచ్చింది. దాంతో అక్కడ కూడా వైసీపీ వ్యూహమేదీ వర్కౌట్ కాలేదని చెబుతారు

**సీన్ మొత్తం అంతే :**

ఇక చూస్తే గిద్దలూరులో నాన్ లోకల్ ని వైసీపీ హైకమాండ్ ఇంచార్జి ఇచ్చారు. కానీ రెడ్డి సామాజిక వర్గమంతా సబ్ క్యాస్ట్ ఆ అభ్యర్థికి లేవు. కానీ అక్కడ అంతా సబ్ క్యాస్ట్ కే మొదటి ప్రాధాన్యత ఇస్తారు. అలా గిద్దలూర్లో అయితే ఆ పార్టీ ఇంచార్జి అసలు గ్రామ కమిటీలు కూడా వేయలేకపోతున్నారు అన్న విమర్శలు ఉన్నాయి. దాంతో ఇంకా చాలా గ్రామాలు ఖాళీగా ఏ కమిటీలు లేకుండా ఉన్నాయని అంటున్నారు. ఇక ఆయన ఉండేది మార్కాపురంలో గిద్దలూరుకి చుట్టపు చూపుగా వస్తూ పోతూ ఉన్నారు అంటున్నారు. దాంతో గిద్దలూరులోని వైసీపీ క్యాడర్ అయితే ఇంచార్జిని నమ్మడం లేదని అంటున్నారు. దాంతో ఆయనకే 2029లో టికెట్ వస్తుందా లేదా అన్నది కూడా చాలా మంది అనుకుంటున్న నేపథ్యం ఉంది.

**పార్టీలోనే వ్యతిరేకత :**

ఇక మార్కాపురంలో అయితే ఇంచార్జికి గ్రామంలో ఉన్న రెడ్డి సామాజిక వర్గం నాయకులకు అసలు సపోర్టు చేయడం లేదని అంటున్నారు. ఎందుకంటే గతంలో ఆ ఇంచార్జికి అక్కడి రెడ్డి సామాజిక వర్గం నేతలకు పడడం లేదని భావించే గిద్దలూరు నుంచి వచ్చి మార్కాపురంలో పోటీ చేశారు అని గుర్తు చేస్తున్నారు. అయితే అక్కడ మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు. వారి వర్గం కూడా బలంగా ఉంది. అందుకే ఆయనకు మద్దతు ఇవ్వవద్దని అని బహిరంగానే వైసీపీ నేతలు చెబుతున్నారని టాక్ నడుస్తోంది. దాంతో అక్కడ కూడా చాలా ఇబ్బందిగా ఉంది అని అంటున్నారు.




**కనిగిరిలోనూ ఇబ్బందిగానే :**

ఇక కనిగిరి నియోజకవర్గంలో అయితే గతంలో ఎమ్మెల్యేగా ఉన్న వారి వర్గీయులు ప్రస్తుతం ఇంచార్జికి ఏ మాత్రం మద్దతు ఇవ్వడం లేదు, పైగా బాహాటంగా వ్యతిరేకిస్తున్నారు. ఇంచార్జి తీరు పట్ల అక్కడ రెడ్డి సామాజిక వర్గం గుర్రుగా ఉనంటున్నారు అని చెబుతున్నారు. ఇక కనిగిరి ఇంచార్జికి డబ్బులు సమస్యగా ఉంది అని అంటున్నారు. ఇదే విషయం పెద్ద ఎత్తున డిస్కషన్ గా ఉంది. కనిగిరి ఒక్కటే కాదు మార్కాపురం, గిద్దలూరు ఇంచార్జిలు కూడా డబ్బులు తీయడం లేదు అని పార్టీలోనే కామెంట్స్ ఉన్నాయి.

**ఈయన ఒక్కడే బెస్ట్ :**

ఇక యెర్రగుండపాలెం ఎస్సీ ఎమ్మెల్యే మాత్రం బెస్ట్ అని అంటున్నారు. ఆయన అందరికీ నియోజకవర్గంలో కలుపుకుని పోతున్నారు అని చెబుతున్నారు. అందరితో మంచి సంబంధాలు నెరుపుతున్నారు అని నియోజకవర్గం క్యాడర్ ఎబుతోంది. ఇక వైసీపీ హైకమాండ్ కి ఆయన మీద మంచి నివేదికలు వెళ్ళాయని అంటున్నారు అలా యెర్రగొండపాలెం ఎమ్మెల్యేకు జగన్ దగ్గర మంచి మార్కులే పడుతున్నాయని అంటున్నారు. దాంతో అతనికి ఏ ఇబ్బంది ఉండదని వచ్చే ఎన్నికల్లో టికెట్ ఖాయమని అంటున్నారు.

**మూడు సీట్లూ ఫోకస్ పెట్టాల్సిందే :**

అయితే కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లలో మూడు అసెంబ్లీ సీట్ల మీద వైసీపీ అధినాయకత్వం ఫోకస్ పెట్టాల్సిందే అని అంటున్నారు. మార్కాపురం, కనిగిరి, గిద్దలూరూ ఈ మూడు సీట్లను బలమైన రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వాలని కోరుతున్నారు ఇంచార్జిలుగా ఉన్న వారు జనంతో ఉండాలని క్యాడర్ ని కలుపుకుని పోవాలని డబ్బులు ఖర్చు పెట్టాలని కోరుతున్నారు. లేకపోతే ఇబ్బంది అవుతుందని అంటున్నారు. ఈ ముగ్గురు ఇంచార్జిల పనితీరు మీద గుర్రుగా ఉన్న క్యాడర్ అయితే వారిని మార్చాలని తామే హైకమాండ్ ని కోరుతామని కూడా అంటున్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఈ నియోజకవర్గాలలో కనుక మార్పులు చేసి బలమైన రెడ్లని ఇంచార్జులుగా నియమిస్తే వైసీపీకి తిరుగు ఉండదని అంటున్నారు. దాంతో మార్కాపురం జిల్లాలో నాలుగు అసెంబ్లీ సీట్లను వైసీపీ గెలుచుకుని తీరుతుందని వైసీపీ అంటున్నారు. మరి హై కమాండ్ ఈ విషయంలో ఏ రకమైన నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉంది అని అంతా చర్చిన్ చర్చించుకుంటున్నారు.

# వరల్డ్ కప్ ఫైనల్‌లో గొడవ.. అర్ష్‌దీప్ సింగ్‌కి షాక్ ఇచ్చిన ఐసీసీ




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా నంబర్--1 టీ20 బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ బిగ్ షాక్ ఇచ్చింది. పొట్టి ప్రపంచకప్ 2026 ఫైనల్లో న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ పట్ల ప్రవర్తించిన తీరుపై భారీగా ఫైన్ విధించింది. మ్యాచ్ ఫీజ్ లో 15 శాతం కోత పెట్టడంతో పాటు ఓ డీమెరిట్ పాయింట్ కూడా ఇచ్చింది. గత 24 నెలల్లో ఇదే ఫస్ట్ తప్పిదం కావడంతో అర్ష్‌దీప్ మ్యాచ్ నిషేధం ప్రమాదాన్ని తప్పించుకున్నాడు. పూర్తి వివరాల్లోకి వెళితే.. తాజాగా ముగిసిన టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో డారిల్ మిచెల్ పైకి అర్ష్‌దీప్ ప్రమాదకరంగా బంతిని విసిరాడు. ఈ ఘటనను సీరియస్ గా తీసుకున్న ఐసీసీ అతడిపై కఠిన చర్యలు చేపట్టింది. వాస్తవానికి డారిల్ మిచెల్ పై అర్ష్‌దీప్ అంత సీరియస్ గా బంతిని విసరాల్సిన పని లేదు.. ఫాలో అప్ లో భాగంగా బాల్ ని వికెట్లపైకి విసరడంతో ప్రమాదవశాత్తు అది మిచెల్ కి గట్టిగా తాకింది. ఆ సమయంలో మిచెల్ సైతం సహనాన్ని కోల్పోవడంతో.. అర్ష్‌దీప్ అతన్ని పట్టించుకోకుండా తాను బౌలింగ్ చేసేందుకు వెళ్లిపోయాడు. దీంతో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సర్ది చెప్పడంతో ఆ గొడవ అంతటితో ఆగిపోయింది. ఈ ఘటన జరిగిన తర్వాత మిచెల్ కి క్షమాపణలు చెప్పిన అర్ష్‌దీప్ షేక్ హ్యాండ్ ఇచ్చి హగ్ చేస్తున్నారు.

ఇలాంటి ఘటనలు ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ లోని ఆర్టికల్ 2.9 రూల్స్ ఉల్లంఘన కిందికి వస్తాయి. దీని ప్రకారం, బంతి లేదా ఇతర క్రికెట్ సామగ్రిని మరో ప్లేయర్ వైపు అనుచితంగా

లేదా ప్రమాదకరంగా విసరడం తప్పు.. ఇందుకు తగిన మూల్యాన్ని అర్ష్‌దీప్ చెల్లించుకున్నాడు. ఇక ప్రపంచకప్ ఫైనల్లో కివీస్ పై భారత్ 96 పరుగుల తేడాతో గెలిచి వరుసగా రెండో టీ20 వరల్డ్ కప్ ని సొంతం చేసుకుంది. మొత్తంగా ఐదో ప్రపంచకప్ లని టీమిండియా ఇప్పటి వరకు (1983, 2011 (వన్డే), 2007, 2024, 2026 (టీ20)) కైవసం చేసుకుంది.

# హార్దిక్ కుటుంబంలో చిచ్చు పెట్టిన మహికా శర్మ.. విడిపోతున్న పాండ్యా బ్రదర్స్..?




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా కుటుంబంలో అతడి గర్ల్ ఫ్రెండ్ మహికా శర్మ చిచ్చు పెట్టింది. ఇద్దర అన్నదమ్ముల ( హార్దిక్-- కృనాల్ పాండ్యా) మధ్య విభేదాలు వచ్చాయా అనే చర్చ ప్రస్తుతం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. ఇటీవల జరిగిన టీ20 ప్రపంచకప్ 2026 తర్వాత అభిమానులు గమనించిన కొన్ని విషయాలు ఈ ఊహాగానాలకు బలం చేకూర్చుతున్నాయి. వరల్డ్ కప్ గెలిచిన తర్వాత దేశవ్యాప్తంగా సంబరాలు జరిగాయి.. ఈ టోర్నీలో హార్దిక్ పాండ్య కీలక పాత్ర పోషించాడు. ఈ విజయానికి సంబంధించిన పోస్టులు లేదా అభినందనలు అతని అన్న క్రునాల్, వదిన పంకురి శర్మ నుంచి నెట్టింట ఎక్కడ కనిపించకపోవడంతో ఫ్యాన్స్ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు, ఫైనల్ మ్యాచ్ లో కృనాల్ పాండ్యా, ఆయన భార్య స్టేడియంలో కనిపించకపోవడం ఈ చర్చకు మరింతగా వైరల్ అవుతుంది. దీంతో ఇద్దరు సోదరుల మధ్య ఏమైనా విభేదాలు వచ్చాయా అనే ప్రశ్నలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కొంతమంది ఫ్యాన్స్ అభిప్రాయం ప్రకారం.. హార్దిక్ పాండ్యా-- మోడల్ మహికా శర్మ మధ్య ఉన్న సన్నిహిత సంబంధం వల్లే ఈ పరిస్థితికి కారణమై ఉండొొచ్చని పేర్కొంటున్నారు. 25 ఏళ్ల మహికా శర్మ టీ20 వరల్డ్ కప్ మొత్తం హార్దిక్‌తో కలిసి ప్రయాణిస్తుస్తూ స్టేడియంలో అతనికి సపోర్టు చేసింది. ముంబైలోని వాంఖెడే స్టేడియంలో ఇంగ్లాండ్‌తో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్ సమయంలో హార్దిక్ కుమారుడు అగస్త్య పాండ్య కూడా మహికాతో కలిసి మ్యాచ్‌ను వీక్షించాడు. హార్దిక్ 12 బంతుల్లో 27 పరుగులు చేసి అవుట్ కావడంతో అగస్త్య కొంత నిరాశకు గురైనట్లు కనిపించగా, మహికా అతన్ని ఓదార్చిన దృశ్యాలు కూడా నెట్టింట వైరల్ అయ్యాయి. ఫైనల్ లో గెలిచిన అనంతరం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో హార్దిక్-- మహికా రొమాన్స్ చేసుకోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. సోషల్ మీడియాలో ఈ విషయంపై ఫ్యాన్స్ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఇది కేవలం ఊహాగానం మాత్రమే అంటున్నారు. నెట్టింట పోస్టులు పెట్టకపోతే కుంటుంబంలో విభేదాలు ఉన్నాయని అనుకోవడం సరైంది కాదు.. ఫ్యామిలిలో చిన్న చిన్న మనస్పర్ధలు వస్తుంటాయని ఒక యూజర్ రాసుకొచ్చాడు. మరో వ్యక్తి ఇలా కామెంట్ పెట్టాడు.. హార్దిక్ గత ఏడాది నుంచి వేరుగా ఉంటున్నాడు.. మహికాతో జరిగిన ఎంగేజ్‌మెంట్‌కు కూడా కృనాల్‌ను ఆహ్వానించలేదని తెలుస్తుందని పేర్కొన్నాడు. అయితే ఒక ప్రేమ ఇద్దరి అన్నదమ్ముల మధ్య బంధాన్ని విడదీసిందని మరో నెటిజన్ కామెంట్ చేశాడు. అయితే, ఇప్పటి వరకు హార్దిక్ పాండ్యా గానీ కృనాల్ పాండ్యా కానీ ఈ విషయంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దాంతో ప్రస్తుతం జరుగుతున్న చర్చ అంతా అభిమానుల ఊహాగానాలకే పరిమితమైంది.

# రెండ్రోజుల పాటు బాగా తిని, హాయిగా నిద్రపోతా: సూర్యకుమార్ యాదవ్





**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ వంటి మెగా టోర్నీని గెలిచిన తర్వాత మీ తదుపరి ప్రణాళిక ఏంటి? అని అడిగితే ఏ కెప్టెన్ అయినా తర్వాతి సిరీస్‌ల గురించో, భవిష్యత్ సవాళ్ల గురించో చెబుతారు. కానీ టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాత్రం చాలా సరదాగా, సింపుల్‌గా సమాధానమిచ్చాడు. “ప్రస్తుతానికి నా ప్లాన్ ఒక్కటే. ఇంటికి వెళ్లి, మంచి భోజనం చేసి, రెండ్రోజులు హాయిగా నిద్రపోవాలి. ఆ తర్వాతే మిగతా విషయాల గురించి ఆలోచిస్తా” అని తన తక్షణ కర్తవ్యాన్ని వెల్లడించాడు. స్వదేశంలో జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో గెలిచి, ఈ ఘనత సాధించిన తొలి ఆతిథ్య జట్టుగా చరిత్ర సృష్టించిన ఆనందంలో ఉన్న సూర్య... ముంబైలోని తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడాడు. ఈ విజయం జట్టు సభ్యులదే కాదు, అభిమానులది కూడా అని అన్నాడు. “మీరంతా మాతో సమానంగా సంబరాలు చేసుకున్నారు. మీ అందరికీ అభినందనలు. భారత్‌లో ప్రపంచకప్ గెలవడం చాలా ప్రత్యేకమైన అనుభూతి. ఎంతో మంది మద్దతు, ప్రార్థనల వల్లే ఇది సాధ్యమైంది” అని తెలిపాడు. ఈ విజయం వెనుక మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ప్రోత్సాహం ఎంతో ఉందని సూర్య గుర్తు చేసుకున్నాడు. “2024లో రోహిత్ కెప్టెన్సీలోనే మేం టీ20 ప్రపంచకప్ గెలిచాం. ఆ తర్వాత అతడు కెప్టెన్సీ నుంచి తప్పుకున్నప్పుడు నాపై పూర్తి నమ్మకం ఉంచాడు. గత రెండేళ్లుగా ఈ జట్టును విజయవంతంగా నడిపించాను. ఇప్పుడు ప్రపంచకప్ కూడా గెలిచాం. నాపై రోహిత్ పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టడం చాలా ఆనందంగా ఉంది. ఈ విజయం యావత్ భారతదేశానిది” అని సూర్య వివరించాడు. టోర్నమెంట్‌కు ముందు రోహిత్ వ్యాఖ్యలను కూడా సూర్య పంచుకున్నాడు. “మీ జట్టు చాలా బాగుంది. ధైర్యంగా ఆడండి. గెలుపు మీదే అవుతుంది” అని రోహిత్ చెప్పిన మాటలు తమలో స్ఫూర్తి నింపాయని అన్నాడు.

ప్రస్తుత విజయంతోనే ఆగిపోమని, భవిష్యత్ లక్ష్యాలపై తమకు స్పష్టమైన ప్రణాళిక ఉందని సూర్య వెల్లడించాడు. “2028లో జరగనున్న ఒలింపిక్స్‌లో క్రికెట్ తరఫున దేశానికి స్వర్ణ పతకం అందించడమే మా తదుపరి లక్ష్యం. అదే ఏడాది మరో టీ20 ప్రపంచకప్ కూడా ఉంది. కాబట్టి హ్యాట్రిక్ ప్రపంచకప్‌లు గెలిచేందుకు మా వంతు కృషి చేస్తాం” అని ధీమా వ్యక్తం చేశాడు. ప్రపంచకప్ గెలిచిన రాత్రి జరిగిన సంబరాల గురించి చెబుతూ... “ఆ రాత్రి మేం ఏం చేశామో చెప్పాలనుంది కానీ... ఉదయం 8 గంటల వరకు మేల్కొనే ఉన్నాం. ఒక టీమ్‌గా గెలిచినప్పుడు సంబరాలు కూడా కలిసే చేసుకోవాలి. అందుకే మేమంతా కలిసే ఆనందాన్ని పంచుకున్నాం” అని సూర్య తెలిపాడు. వరుసగా రెండుసార్లు (2024, 2026) ఐసీసీ టోర్నీలు గెలవడంతో తమపై ఒత్తిడి ఉన్నప్పటికీ, సరైన సమయంలో రాణించామని సూర్య పేర్కొన్నాడు. ఒత్తిడి లేకపోతే ఆటలో మజా ఉండదని వ్యాఖ్యానించాడు. ముంబై చేరుకున్న తర్వాతే ప్రపంచకప్ గెలిచామనే అసలైన భావన కలుగుతోందని, ఈ ఆనందం చాలాకాలం పాటు తనతోనే ఉంటుందని చెప్పుకొచ్చాడు. తన క్రికెట్ ప్రయాణం మొదలైన ముంబైని ఎప్పటికీ వీడనని, తాను భారతీయుడిగా గర్విస్తున్నానని సూర్య పేర్కొన్నాడు.

# ‘బేబీ’ జంట కొత్త మూవీ.. ఫస్ట్ సింగిల్ విన్నారా?







టాలీవుడ్ యంగ్ క్యాస్టింగ్ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఎపిక్– ఫస్ట్ సెమిస్టర్ నుంచి రిలీజ్ అయిన ఫస్ట్ సింగిల్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. సంచారమే అంటూ సాగుతున్న ఆ పాట మంచి రెస్పాన్స్ అందుకుంటూ.. సూపర్ మెలోడీగా మెప్పిస్తోంది. సినిమా కథలోని మెయిన్ రోల్స్ ఎమోషనల్ జర్నీని సాంగ్ క్లియర్ గా చూపిస్తోంది.

ఆ పాటకు ప్రముఖ కవి, రైటర్ గోరటి వెంకన్న లిరిక్స్ అందించగా.. ప్యూర్ తెలుగు పదాలు, హృదయాన్ని తాకే భావాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇండియన్ కల్చర్, ఫారిన్ లైఫ్ స్టైల్ మధ్య ఉండే తేడాలను సింపుల్ గా వ్యక్తపరుస్తూ సంచారమే పాట సాగుతుంది. సినిమా స్టోరీకి అనుగుణంగా, యూత్ మనసుల్లోని ఫీలింగ్స్ వ్యక్తపరిచేలా సాంగ్ ను రూపొందించినట్లు చిత్రబృందం తెలిపింది.

సంచారమే పాటకు ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ బాణీలు కట్టారు. ఆయన కంపోజిషన్ సాంగ్ కు మరింత అందాన్ని తీసుకొచ్చింది అంతేకాకుండా హేషమ్ అబ్దుల్ వహాబ్, గోరటి వెంకన్న కలిసి సాంగ్ ను ఆలపించడం విశేషం. వారి వాయిస్ పాటలోని భావాన్ని ప్రేక్షకుల హృదయాలకు **చేరవేస్తుందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు.**

అదే సమయంలో సాంగ్ విజువల్స్ పరంగా కూడా ఆకట్టుకుంటోంది. ఫారిన్ బ్యాక్ డ్రాప్ తో షూట్ చేసిన ఆ సాంగ్ లో లండన్ లోని ఫేమస్ స్పాట్స్ చూపించారు మేకర్స్. అక్కడి నేచర్ సీన్స్, సిటీ వాతావరణం మధ్య తెలుగు పాటను చిత్రీకరించిన విధానం ప్రేక్షకులను ఆకర్షిస్తోంది. ఓవరాల్ గా సాంగ్ మ్యూజిక్ లవర్స్ ను ఆకట్టుకుని.. అనేక మంది ఫేవరెట్ లిస్ట్ లోకి చేరిపోయిందని చెప్పాలి. ఇక సినిమాలో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మరోసారి కలిసి నటిస్తున్నారు. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన బేబీ సినిమా మంచి విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రంతో ప్రేక్షకుల మనసుల్లో నిలిచిన జంట మళ్లీ కలిసి నటించడంతో కొత్త సినిమాపై ఆసక్తి పెరిగింది. ఇప్పుడు సాంగ్ లో వీరి మధ్య కనిపించే ఎమోషనల్ మూమెంట్స్, కెమిస్ట్రీ, స్క్రీన్ ప్రెజెన్స్ ఆకట్టుకుంటున్నాయి. ఎపిక్– ఫస్ట్ సెమిస్టర్ మూవీతో ఆదిత్య హాసన్ డైరెక్టర్ గా పరిచయమవుతున్నారు. ఇప్పటికే ఆయన తీసిన 90స్ వెబ్ సిరీస్ ఓ రేంజ్ లో మెప్పించగా.. ఇప్పుడు సిల్వర్ స్క్రీన్ పై లక్ ను టెస్ట్ చేసుకోనున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగ వంశీ, సాయి సౌజన్య సినిమాను నిర్మిస్తున్నారు. సినిమాటోగ్రఫీ అజీమ్ మహమ్మద్ నిర్వహించగా, ఎడిటింగ్ బాధ్యతలు నవీన్ నూలి చేపట్టారు. మరి స్మూత్ లవ్ స్టోరీతో రూపొందుతున్న ఎపిక్– ఫస్ట్ సెమిస్టర్ ఎప్పుడు రిలీజ్ అవుతుందో, ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 4-79, Revenue Colony, Tammireddy Palem, Kottapeta Editor : Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A3664 , e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965